కమిషనర్ సంతకాల ఫోర్జరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 19: ఎస్ఎంసీ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన ఘటనపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శుక్రవారం నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎన్ఎంసీలో కమిషనర్ సంతకాన్ని కొందరు ఫోర్జరీ చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో మేయర్ భర్త జయవర్ధన్, అసిస్టెంట్ శివకృష్ణ, మరికొందరు భాగస్వామ్యులంటూ విమర్శలు వచ్చాయి. దీంతో సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని గత కమిషనర్ వికాస్‌మర్మత్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.


సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, భక్తులు



బారాషహీద్ దర్గాలో భక్తులు



ఫకీర్ల గీతాలాపన


సంక్షేమ, అభివృద్ధి రొట్టె అందుకుంటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు


దర్గాలో అమరుల సమాధులకు గంధంతో లేపనం చేస్తున్న కడప పీఠాధిపతి ఆరీఫుల్లా తదితరులు

అందరి కోరికలు నెరవేరాలి
రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి!

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష
- వర్చువల్ విధానంలో భక్తులతో మాట్లాడిన సీఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 19 : 'ఎంతో విశిష్టత కలిగిన రొట్టెల పండుగకు వచ్చి రొట్టెలు అందుకున్న ప్రతి ఒక్కరి కోరికలు నెరవేరాలి. అలాగే రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. పండుగకు విచ్చేసిన భక్తులతో వర్చువల్ విధానంలో చంద్రబాబు శుక్రవారం అమరావతి నుంచి మాటామంతీ జరిపారు. భక్తుల విశ్వాసాన్ని అడిగి తెలుసు కోవడంతో పాటు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా భక్తులను ద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. దేవుడిపై నమ్మకంతో ప్రపంచం నడుస్తోందని, ఆ నమ్మకాలను, ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించా లని అన్నారు. రాష్ట్రానికి మంచి జరిగేలా పండుగకు వచ్చిన భక్తులు ప్రార్థించాలని సీఎం కోరారు. రాష్ట్ర ఖజానా నిండేలా దేవుడిని ప్రార్థిస్తూ రొట్టెలు మార్చు కోవాలని కోరారు. భవిష్యత్తులో రొట్టెల పండుగను ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌గా నిర్వహించేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారా యణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే లు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేదు మాధవన్, కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, టీడీపీ నేతలు అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షిస్తూ ముస్లింల ఆనందం

రూ.5 కోట్లు కేటాయిస్తే మరింత అభివృద్ధి

రొట్టెల పండుగకు 2014లో 4 లక్షల మంది భక్తులు వస్తే ఆ సంఖ్య 2019కు 20 లక్షలకు చేరుకుంది. దర్గా ప్రాంగణాన్ని ఎంతో అభివృద్ధి చేశాము. అయితే కొన్ని పనులు ఇంకా చేయాల్సి ఉంది. రూ.5 కోట్లు కేటాయిస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తాము.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర మంత్రి

ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయి



మూడేళ్లుగా మేము రొట్టెల పండుగకు వస్తున్నాము. ఆరోగ్యం, గృహం, ఇలా అనేక రొట్టెలు పట్టుకున్నాము. మొదటి సంవత్సరం కోరుకున్న కోరికలు నెరవేరడంతో అప్పటినుంచి వస్తున్నాము. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఏర్పాట్లు బాగున్నాయి.

- షేక్ రెహమున్నీసా, విజయవాడ

ఏర్పాట్లు బాగున్నాయి!



రెండేళ్లుగా రొట్టెల పండుగకు వస్తున్నాము. గతంలో కంటే ఈ ఏడాది ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. మేము ముందుగానే అనుకున్నాము బాబు వచ్చాడుగా ఏర్పాట్లు బాగుంటాయని. రాబోయే రోజుల్లో మరిన్ని ఏర్పాట్లు చేస్తారన్న నమ్మకం మాకుంది.

- విజయకుమారి, విజయవాడ

జడివానలోనూ
తరగని విశ్వాసం

- భక్తజనసంద్రంగా బారాషహీద్ దర్గా
- భక్తులతో కిక్కిరిసిపోయిన స్వర్ణాల చెరువు
- వేడుకగా గంధమహోత్సవం
- పాల్గొన్న కడప పీఠాధిపతి
- రొట్టెలు పట్టుకున్న ప్రముఖులు



స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఇసుక వేస్తే రాలనంతగా తరలివచ్చిన భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 : నేల ఈనిందా... ఆకాశానికి చిల్లుపడిందా!? అన్న రీతిలో నెల్లూరు నగరానికి భక్తజనం పోటెత్తింది. దేశం నలుమూలల నుంచి రొట్టెల పండుగకు యాత్రికులు తరలిరావడంతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. ఓ వైపు గురువారం సాయంత్రం నుంచే జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయని భక్తులు దర్గా ప్రాంగణంలోనే ఉండిపోయారు. కాగా, పండుగలో ప్రధాన ఘట్టం గంధమహోత్సవం గురువారం అర్ధరాత్రి తర్వాత వేడుకగా జరిగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో 12 బిందెల్లో గంధం కలిపి ప్రత్యేక పూలరథంలో ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకువచ్చారు. అక్కడ గంధపు బిందెలను ఉంచి బారాషహీద్‌ల వీరగాథలను కొనియాడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా (అమీన్ పీర్) అమరవీరుల సమాధులకు గంధం పూశారు. తదుపరి దువా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రొట్టెల పండుగ ప్రారంభమైంది. జడివానలోనూ చెదరని భక్తివిశ్వాసంతో స్వర్ణాల చెరువులో కోరికల రొట్టెలను ఇచ్చి, పుచ్చుకున్నారు. ఆ తర్వాత బారాషహీదులను దర్శించుకొని పూజలు చేశారు. కాగా, పండుగలో ఇప్పటివరకు (3 రోజులు) సుమారు ఆరు లక్షల మందికిపైగా భక్తులు పాల్గొని ఉంటారని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. తరలివచ్చిన భక్తులకు అన్ని శాఖల అధికారులు విస్తృత సేవలు అందిస్తున్నారు. రాత్రి స్వర్ణాల చెరువులో రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి, శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు అభివృద్ధి, సంక్షేమ రొట్టెలను అందుకున్నారు. కాగా, దర్గా ప్రాంగణంలో కొంతమంది పోలీసుల తీరుపై మీడియా ప్రతినిధులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే వీవీఐపీ పాసులు ఉన్న వారిని, అధికార పార్టీ నాయకులనూ పోలీసులు అడ్డుకోవడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వీక్షించేందుకు దర్గాలో పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అయితే వాటిలో సగానికిపైగా పనిచేయక పోవడంతో భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.


బారాషహీద్ దర్గా దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్ను మూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.

- కోవూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు)



తెలుగు కవిత్వంలో
నిలువెత్తు సంతకం
అడిగోపుల వెంకటరత్నంకు నివాళి

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. విదేశాల్లో ఉన్న కుటుంబసభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.


"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది.. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాప కం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉం టుంది... నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెతీగలం ..ఎదు గూ బొదుగూ లేని వాళ్ళం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్‌దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడుగా గుర్తిం పు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూపొందించిన చిత్రాలనే ముఖచిత్రాలుగా ముద్రించుకున్నారు. అడిగోపుల కవిత్వంపై వేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎన్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.

అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవారు, తానా అవారు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవారు,తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం , నూతలపాటి కవి తా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్ధమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.


అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్ళీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగది , ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు , మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వ గీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.



వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా

- వీఎస్‌యూ ఇన్‌చార్జ్ వీసీ విజయభాస్కర్‌రావు



వెంకటాచలం, జూలై 19 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఉపకులపతి (వీసీ) డాక్టర్ సారంగం విజయభాస్కర్ రావు స్పష్టం చేశారు. వర్సిటీలోని పరిపాలన భవనంలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కే సునీత, వర్సిటీ అధికారులు, సిబ్బంది విజయభాస్కరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వర్సిటీలోని అన్ని శాఖలు, తరగతి గదులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. అందరం కలిసికట్టుగా కృషి చేస్తూ విద్యార్థులకు చక్కటి సదుపాయాలతో కూడిన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు.

భారీ బందోబస్తు మధ్య

గంధమహోత్సవం

నెల్లూరు(క్రైం): జూలై 19: బారాషాహీద్ దర్గా గంధమహోత్సవం గురువారం అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తు మధ్య ముగిసింది. ఈ కార్యక్రమంలో లక్షలాదిమంది భక్తులు పాల్గొనడంతో తోపులాట జరిగే అవకాశం ఉండటాన్ని పోలీసు అధికారులు ముందే గుర్తించారు. జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ గురువారం రాత్రి దర్గాకు చేరుకుని బందోబస్తును పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అంతేకాక పెద్దఎత్తున పోలీసు బలగాలు, రోప్‌పార్టీ దర్గాప్రాంగణానికి చేరుకుంది. అనంతరం దర్గా ఆవరణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంధ మహోత్సవాన్ని పూర్తి చేశారు. శుక్రవారం భక్తులు ప్రశాంతంగా దర్గాను దర్శించుకునేలా బందోబస్తు ఏర్పాటు చేశారు. క్రైమ్‌పార్టీ పోలీసులు ఏడుగురు పిక్‌పాకెటర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. దర్గా ఆవరణంలో పడి ఉన్న రెండు దుస్తుల సంచులను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులకు అందించారు. తప్పిపోయిన 152 మంది చిన్నారులను వారి తల్లి దండ్రులకు అప్పగించారు. దర్గా వద్ద బందోబస్తులో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాస రావు, నెల్లూరు నగర, కావలి డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



వెంకటాచలం, జూలై 19 : కసుమూరులోని మస్తాన్ వలీ దర్గా దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చిన యాత్రికులు కసుమూరుకు తరలివస్తున్నారు. దీంతో గ్రామం కిక్కిరిసిపోతోంది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మన రాష్ట్రం నుంచేగాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. వెంకటాచలం నుంచి కసుమూరు వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుకుని చెట్ల కింద సేద తీరారు. కొందరు భక్తులు షాఫాబావి (మస్తాన్ స్వామి బావి) వద్ద పుణ్య స్నానాలు చేశారు. వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు కూడలి, షాఫాబావి, చందన్‌మహల్, పార్కుల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే స్పందించి పునరుద్ధించారు. వక్ఫ్ బోర్డు అధికారులు తాగునీటి చలివేంద్రాలు, షామియానాలు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన కసుమూరు



కసుమూరు ప్రధాన మార్గంలో భక్తుల రద్దీ

● **ఏఎస్‌పేటలో తగ్గిన రద్దీ**

ఏఎస్‌పేట : భక్తుల రద్దీ తగ్గడంతో శుక్రవారం దర్గా ప్రాంగణం వెలవెలబోయింది. రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో భక్తులు అవస్థలు పడ్డారు. శుక్రవారం కూడా వర్షం కురవడంతో ఏఎస్‌పేటకు ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు.

తెలిసినవారు చెబితే వచ్చాం



బెంగళూరు నుంచి వచ్చిన వారు రొట్టెల పండుగ విశిష్టత గురించి చెబితే వినివచ్చాం. మేము తయారు చేసుకొని వచ్చిన వ్యాపార, వివాహ రొట్టెలను ఇతరులకు పంచి పెట్టాం. మేము సంపద రొట్టె అందు కున్నాము. స్వర్ణాల చెరువులో బోటు షికారు చేశాం. దర్గాను దర్శించు కున్నాం. దర్గాలో ఏర్పాట్లు బాగున్నాయి.

- బాషా కుటుంబం, బెంగుళూరు

దర్గా దర్శనం మహద్భాగ్యం



స్వర్ణాల చెరువులో స్నాన మాచరించి, దర్గాలో దేవుళ్లను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయనేది మా నమ్మకం. వివాహ, చదువు రొట్టెలను ఇతరులకు ఇచ్చాం. వారి నుంచి సంపద రొట్టెలు తీసుకున్నాం. దర్గాలో దర్శనాన్ని మహద్భాగ్యంగా భావిస్తున్నాం. దర్గాలో మనసారా కోరు కుంటే మంచి జరుగుతుంది. ఆనందంతో వెళుతున్నాం.

- ఎస్‌కే చాన్‌బాషా కుటుంబం, తిరుపతి

అంతా బాగుంది!



ఆరోగ్యం బాగుండాలని గతంలో వచ్చినప్పుడు కోరుకున్నాం. ఇప్పుడంతా బాగుంది. ఈసారి సంపద రొట్టె కోసం వచ్చాం. రొట్టెల పండుగకు వస్తే కోరిన కోరికలు తీరుతున్నాయి. ఇంతకన్నా ఇంకేం కావాలి. నంద్యాల నుంచి మా కుటుంబంతో పాటు మా స్నేహితుల కుటుంబ సభ్యులు కూడా వచ్చారు.

- నబీజోహాన్,షాహీన్ కుటుంబం, నంద్యాల

వ్యాపార రొట్టె కోసం వచ్చాం



రొట్టెల పండుగ గురించి మావూళ్లో గొప్పగా చెప్పుకుంటుంటారు. చూద్దామని వచ్చాము. అలాగే వ్యాపార రొట్టె కూడా అందుకున్నాము. కోరిక నెరవేరితే మళ్లీ వస్తాం. ఇక్కడికి వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఏర్పాట్లు బాగున్నాయి.

- అనీల్‌రెడ్డి, గాయత్రి దంపతులు, అనంతపురం

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

● నిందితుడు బాపట్ల జిల్లా వాసిగా గుర్తింపు



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట): జూలై 19: అతడు వ్యసనాలకు బానిసయ్యాడు.. ఈజీగా డబ్బు ఎలా సంపాదించాలని ఆలోచిస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లను పరిశీలించాడు. ఈ క్రమంలో రైళ్లలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కొంతకాలంగా రైళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులు గప్పి తిరుగుతుండగా నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సీ విజయభాస్కర్ నిందితుడి వివరాలను శుక్రవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకి అలియాస్ వెంకటేష్ కూలి చేసుకుంటూ జీవించేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసయ్యాడు. సంపాదించిన డబ్బు తన అవసరాలకే సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలన్ని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో రైళ్లలో దొంగతనాలు చేసే రీల్స్‌ను చూసి దొంగగా మారాడు. రైళ్లలో తిరుగుతూ ప్రయాణికులు ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌లు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను దొంగలించి వాటిని అమ్ముకొని వచ్చిన సొమ్ముతో జల్సాగా జీవించేవాడు. ఇటీవల చీరాలలో రైలు దొంగతనాలు అధికం కావడంతో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారంగా నిందితుడు వెంకటేశ్వర్లును గుర్తించారు. అతడి కదలికలపై నిఘా ఉంచి గురువారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. పలు రైళ్లలో నేరాలకు పాల్పడినప్పుడు నిందితుడు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి రూ.3.81 లక్షల విలువ చేసే 62 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్, మూడు వాచ్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన చీరాల రైల్వే ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య, సిబ్బంది కే భాస్కర్, గోపి, లక్ష్మీనారాయణ, శ్రీనురాజు, బ్రహ్మయ్యలను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఇన్‌చార్జి సీఐ కె భుజంగరావు, నెల్లూరు, చీరాల ఎస్‌ఐలు మాలకొండయ్య, సీహెచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి అపస్మారకస్థితికి..



విద్యార్థుల బెంచీల మధ్య అపస్మారకస్థితిలో పడి ఉన్న సుందరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 19: ఏరుకొల్లు గ్రామంలో గురువారం ముత్తుకూరుకు చెందిన సుందరం మద్యం అతిగా సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఈయన కొన్నేళ్లుగా బండకిందపల్లిలో ఉంటూ పొలం వద్ద కాపలా ఉండేవాడు. ఈ తరుణంలో మద్యం సేవించి ఏరుకొల్లు ఉన్నత పాఠశాల వద్దకు వచ్చి పాఠశాలకు తాళాలు వేసి ఉండటంతో గేటు దూకి లోపలికి ప్రవేశించి విద్యార్థులు కూర్చొనే బెంచీల మధ్య పడిపోయాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఆ వ్యక్తి అపస్మారస్థితిలో పడి ఉండడాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు 108 వాహనానికి సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం వింజమూరుకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మినగల్లు రీచ్‌లో వాహనదారుల ఘర్షణ



మినగల్లు రీచ్‌లో ఘర్షణకు దిగిన వాహనదారులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 19 : మినగల్లు రీచ్‌లోని డంపింగ్ యార్డులో శుక్రవారం ఇసుక లోడింగ్ విషయమై లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. సీరియల్ నెంబర్లను కాకుండా లోకల్‌పేరుతో ఇష్టానుసారం లోడ్ చేస్తున్నారనే విషయంలో వివాదం తలెత్తింది. పోలీసు ల రంగప్రవేశంతో వివాదం సర్దుమణిగింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకే ఇసుక లోడింగ్ వేళలు. ఆ తర్వాత నుంచి ఉదయం దాకా వేచి ఉన్న టిప్పర్లకు కొంతమంది టిప్పర్‌కు రూ.వెయ్యి తీసుకుని ఇసుక లోడ్ చేస్తున్నారు. అందరూ లోకల్ కావడంతో అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. దీంతో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు ఇసుక లోడింగ్ నిర్వాహకుల్లో ఒకరు కొన్ని ట్రాక్టర్లకు లోడింగ్‌తో వెళ్ళేటప్పుడు అవుట్ టైం నమోదు చేయకుండా రెండో ట్రిప్పు సమయంలో టైం వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తొలి ట్రిప్పునకు రూ.1665 రీచ్‌లో నిర్వాహక అధికారులకు చెల్లిస్తుండగా రెండో ట్రిప్పునకు రూ.1300 ఓ ఫోన్‌పేకి వేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యతోనే శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. చివరకు లోకల్‌కు ఒకటి, బయటవాహనదారులకు ఒక స్లిప్పు చొప్పున రాజీ కుదుర్చుకున్నారు. అయితే, చివరకు షరామామూలే పోయింది. మరోవైపు వైసీపీ ప్రభుత్వంలో చేతివాటం చూపించిన వైసీపీ నాయకులే ఇప్పుడు కూడా తమ హవా చాటుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	135
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	268
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7025
వెండి కిలో ధర	రూ. 92,700
వెండి ఒక గ్రాము	రూ. 94.70

కేజీబీవీల్లో నాణ్యమైన విద్యాబోధన



మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ జేడీ గీత

నెల్లూరు (విద్య), జూలై 19: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయా (కేజీబీవీ)ల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కేజీబీవీల రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ గీత తెలిపారు. కేజీబీవీలోని నూతన పాఠ్యాంశాలపై సైన్స్, గణిత ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం చెముడుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. సైన్సు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరునుంచి పదోతరగతి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేలా పాఠ్యాంశాలు రూపొందించారన్నారు. సిబ్బంది అంతా కూడా సబ్జెక్ట్‌పై పట్టు సాధించడంతో పాటు బోధనా పద్ధతులను ప్రయోగ పూర్వకంగా నేర్చుకోవాలన్నారు. అనంతరం జన్య ఫౌండేషన్ నిర్వాహకులు 12 కేజీబీవీలకు అభ్యాసన పరికరాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ ఉషారాణి, జీసీడీవో మమత, ఏఎంవో సుధీర్‌బాబు, సీఎంవో పెంచలయ్య, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు కే సురేంద్రకుమార్, డీపీ శివకుమార్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ సత్యనారాయణశర్మ, రాయపాటి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (విద్య), జూలై 19: చదువుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ, వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని రమేష్‌రెడ్డినగర్‌లోని కార్పొరేట్ పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ టెన్త్ చదువుతున్న ఓ విద్యార్థిని ఒత్తిడికి గురిచేయడంతోపాటు తీవ్రంగా కొట్టడంతో మనస్తాపం చెందిన ఆ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయమై యాజమాన్యాన్ని ప్రశ్నించగా ఆ ఉపాధ్యాయుడిని తొలగించామని, బలవన్మరణానికి తమకేమీ సంబంధం లేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బాధిత తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయడంతోపాటు యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, పీడీఎస్‌యూ నాయకులు షారూక్, కృష్ణచైతన్య, ఇతర సంఘాల నేతలు శివం వర్మ, ఆశీర్వాదం, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

వారాహిగా రాజరాజేశ్వరి



నెల్లూరు (సాంస్కృతికం) : నగర నాయకి రాజరాజేశ్వరి అమ్మవారు శుక్రవారం వారాహిగా దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, నూతన వస్త్రధారణ, మూల విరాట్‌ను పండ్లు, కాయగూరలతో అలంకరించారు. అలాగే ఆలయం అంతా పండ్లు, కూరగాయలతో తీర్చిదిద్దారు. చండీ హోమం జరిగింది. అలివెట్టి మండపంలో అమ్మవారిని డ్రైఫ్రూట్స్, కూరగాయలతో వారాహిగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రాత్రి హారతులు పల్లకిసేవ, మహానైవేద్యాలు జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ బి.వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు రఘునాథస్వామి తదితరులు పర్యవేక్షించారు.

సోమశిలలో 9.791 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 19: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి డ్యాంలో 9.791 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 20 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 19: అగ్నివీర్ వాయు పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌పై ఆసక్తి ఉన్న వారు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. వినయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయు ఉద్యోగాల కోసం 21 ఏళ్లలోపు వయసు కలిగి, ఇంటర్, ఇంజనీరింగ్, డిప్లమోలో మాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హత ఉన్న పురుషులు, మహిళలు శనివారం నుంచి ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతోపాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలన తదితర అంశాల ఆధారంగా ఎంపికలు నిర్వహిస్తారన్నారు. 2004 జూలై 3వ నుంచి 2008 జనవరి 3 లోపు జన్మించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగలవారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్రాంతిలోపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

● **మత్స్యకారుల సమావేశంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి**

కావలి, జూలై 19: నియోజకవర్గంలోని బోగోలు మండలంలో నిర్మిస్తున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సంక్రాంతి లోపు ప్రారంభమవుతోందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మత్స్యకారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. హార్బర్ ప్రారంభం అయితే మత్స్యకారులకు రాయితీతో బోట్లు అందజేస్తామన్నారు. మత్స్య సంపదను విక్రయించుకోవటానికి దూరప్రాంతాలకు వెళ్లకుండా ఫిషింగ్ హార్బర్‌లోనే విక్రయించుకో వచ్చన్నారు. దీనివలన గిట్టుబాటు ధరలు లభించటమే కాక మత్స్యకారులకు ఉపాధికూడా లభిస్తుందన్నారు. తమిళనాడు జాలర్లు తమ ప్రాంతానికి వచ్చి తమ మత్స్యసంపదను దోచుకునిపోతున్నా అధికారులు పట్టించుకోవటంలేదనే ఆరోపణలు వస్తున్నాయని దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కావలి ఫిషరీస్ ఏడీ శ్రీనివాసులు, రూరల్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, మత్స్యకార కాపులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో వెంచర్లు

● **తెరవెనుక వైసీపీ నాయకులు**

● **ప్లాట్లు కొన్నవారు లబోదిబో..**



మద్దెల మడుగు వద్ద కబ్జా చేసిన స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన అధికారులు

రాపూరు (డక్కిలి), జూలై 19 : పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో పంటలు సాగుచేసుకొని అనుభవించాలే తప్ప వాటిలో లేఅవుట్లు వేసి ప్లాట్లు అమ్మకుడదన్న నిబంధనలకు వైసీపీ నేతలు తిలోదకాలు ఇచ్చారు. రాపూరులో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. రాపూరు సమీపంలోని మద్దెల మడుగు సెంటరులో అసైన్డ్ భూములను లే అవుట్లుగా మార్చి విక్రస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే పునాదులు వేసుకొన్న అక్రమార్కులు మిగిలిన ప్లాట్లను ఇప్పుడు విక్రయిస్తున్నారు. రాపూరు బిట్2 పరిధిలో సర్వే నెం.1056లోని 1వ భిన్నంలో 1.75 ఎకరాలు ప్రభుత్వం భూమి వుంది. ఈ భూమిని గతంలో జొన్న వెంగమాంబ అనే మహిళ అసైన్డ్ పట్టా పొందింది. 20 ఏళ్ల క్రితమే ఆమె ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోవడంతో ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. రెవెన్యూ రికార్డుల్లోనూ సదరు భూమి ప్రభుత్వానిదిగా నమోదై ఉంది. వైసీపీకి చెందిన కొంతమంది కన్ను రూ.కోట్లు విలువ చేసే ఈ భూమిపై పడింది. రాత్రికిరాత్రే ఆ భూమిని ఆక్రమించుకొని లే అవుట్లు వేసేందుకు ప్రయత్నించడంతో రెవెన్యూ అధికారులు గుర్తించి గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం ఆ హెచ్చరిక బోర్డును తొలగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాపూరు, మద్దెలమడుగు, సైదు రాసిపల్లి, వెనుగోను ప్రాంతాల్లోనూ అడ్డగోలుగా లే అవుట్ల వేసి ప్లాట్లు విక్రయించారని స్థానికులు వాపోతున్నారు. ఈ అక్రమాలకు రాపూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు అధికారుల ప్రమేయం ఉందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బుచ్చిలో నిఘా నేత్రాలు ఏమయ్యాయి?

● నాడు దాతల సహకారంతో ఏర్పాటు

● నిర్వహణ లేక కనుమరుగైన సీసీ కెమెరాలు

● వరుస చోరీలు, నేరాలతో ప్రజల బెంబేలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 19 : నేర నియంత్రణ, కేసుల పరిశోధనల కోసం ఆరేళ్ల క్రితం బుచ్చిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కనుమరుగైపోయాయి. పోలీసు అధికారులు, దాతల సహకారంతో బుచ్చి బస్టాండ్, జొన్నవాడ రోడ్డు సెంటర్, విలియమ్స్‌పేటలతోపాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం కారణంగా మూడేళ్లుగా ఆ సీసీ కెమెరాలు కనిపించడంలేదు. అసలు ఆ సీసీ కెమెరాలు ఏమయ్యాయోనంటూ దాతలు విస్మయానికి గురవుతున్నారు. ఒక వేళ మరమ్మతులకు గురైనా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు పలువురు వ్యాపారులు, దాతలు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. సీసీ కెమెరాలు పని చేస్తుంటే నేరాలు, ఘోరాల సమాచారం తెలుసుకుని పోలీసులు వెంటనే అప్రమత్తమై అవకాశం ఉంటుంది. స్టేషన్ నుంచే సీసీ కెమెరాల మానిటర్ ద్వారా ప్రాథమిక దర్యాప్తుతో కేసును ఛేదించే అవకాశాలూ ఉన్నాయి. ఏడాది కాలంగా తరచూ జరుగుతున్న చోరీలు, నేరాలు ఇటు ప్రజలు, అటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కనీసం టోల్‌గేట్ వద్ద సీసీ కెమెరాలు పరిశీలించాలన్నా అక్కడ లైట్లులేక చీకటిమయంగా ఉంటుందని పలువురు అధికారులే వాపోతున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ కోసం పోలీస్‌శాఖలో నిధులున్నా నిరుపయోగమేననే విమర్శలున్నాయి. కొత్త ఎస్పీ కృష్ణకాంత్, స్థానిక పోలీసులు చొరవ తీసుకుని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.



బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద కనుమరుగైన సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

బుచ్చిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసులు ముందుకువస్తే మా వంతు సహాయ సహకారాలు అందిస్తాము. గతంలో కూడా మేము సహకరించాము. అసలు ఆ సీసీ కెమెరాలు ఏమయ్యాయో కూడా తెలీడంలేదు. కొత్తగా వచ్చిన ఎస్పీ కృష్ణకాంత్ ప్రత్యేక చొరవతీసుకుని బుచ్చిలో చోరీలు, నేరాల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలి.

- టీ ఆదినారాయణ, గోల్డ్ మర్చంట్, బుచ్చి

ఊపందుకున్న వరినాట్లు


సంగసానిపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

సీతారామపురం, జూలై 19: మూడురోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో మండలంలో వ్యవసాయ బోర్ల కింద రైతులు ఖరీఫ్ వరినాట్లు వేయడం ప్రారంభించారు. సీతారామపురం, సింగారెడ్డిపల్లి, మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి బసినేనిపల్లి, అయ్యవారిపల్లి ,రంగనాయుడుపల్లి గ్రామాల్లో వరినాట్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో వారంరోజుల్లో అన్ని గ్రామాల్లో నాట్లు ముమ్మరంగా సాగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరలేదు.

వరుస పద్ధతితో అధిక దిగుబడులు : ఏవో

వరుస పద్ధతిల్లో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. కుదురు కుదురు మధ్య 10సెంటీ మీటర్లు, లైన్.. లైన్‌కి మధ్య 20సెంటి మీటర్ల దూరం ఉండేలా నాట్లు వేసుకోవాలని ప్రతిరెండు మీటర్లకు కాలి బాట వదులు కోవాలన్నారు. ఇలా చేస్తే ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఇలా చేయడం వలన పంటకు సూర్యరశ్మి తగిలి, దోమ, చీడపీడలు ఆశించవని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న కొండకిందపల్లి గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, జూలై 19: అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఘాట్‌రోడ్డు సాధన సమితి సభ్యులు సీపీఎంల ఆధ్వర్యంలో శుక్రవారం బండగానిపల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. అటవీ అనుమతులు లేని 3.2కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు చెప్పారు. దశాబ్దాల తరబడి పది గ్రామాల్లోని 16వేల మంది జనాభా రాకపోకలు సాగించే ఈ ఘాట్‌రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వాపోయారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ నా యబ్, భేరి తిరుపాలురెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


జమ్మవరంలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఏఎస్ పేట, జూలై 19: జమ్మవరం ఎస్సీ కాలనీలో శుక్రవారం బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి కేంద్రం అందించే ఉజ్వల ఉచిత గ్యాస్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులులేని వారిని గుర్తించారు. వారికి త్వరలో అందేలా చూస్తామన్నారు. కాలనీలో ప్రధానంగా శాశ్వత ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వర్షం కురిస్తే గుడిసెల్లోకి నీరు చేరి అవస్థలు పడుతున్నారని ఇల్లులేని వారికి శాశ్వత ఇళ్లు కట్టించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చెంచుల రెడ్డి, ఉపాధ్యక్షుడు గునుపూడి శ్రీనివాస్, పెంట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెదబ్బీపురంలో అక్రమ కట్టడాల తొలగింపు

ఏఎస్ పేట, జూలై 19: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని ఏఎస్‌పేట తహసీల్దారు రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పెదబ్బీపురం ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగింపజేశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 10న ఆయనకు నోటీసులు జారీ చేసినా నిర్మాణం కొనసాగిస్తుండడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్మాణలను తొలగించామన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణలు చేడితే చర్యలు తప్పవన్నారు.

వైభవంగా శేషవాహన సేవ


శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

సంగం, జూలై 19: మర్రిపాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి శేషవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణ, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి రామాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వనమా సుబ్రహ్మణ్యం శ్రేష్ఠి ఉభయకర్తలుగా వ్యవహరించారు.ఈవో పెంచల వరప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్: ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా బీసీకాలనీలోని సంతానలక్ష్మికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు లోకా వెంకటప్రసాద్‌శర్మ అమ్మవారిని విశేష కుంకుమ అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు


ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్

ఉదయగిరి, జూలై 19: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వార్డులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు, మందులు, వివిధ రకాల వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయగిరి వైద్యశాలల్లో చిన్నపిల్లల జనరల్ సర్జన్ వైద్యులు నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీడీవో అనీషా, రాగూర్, షంషుద్దీన్, శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

రోగులకు ఆహార పొట్లాల పంపిణీ

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉదయగిరి చారిటబుల్‌ట్రస్టు సభ్యులు రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ప్రతివారం రోగులకు ఆహారం అందజేస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీడీవో అనిషా, వైద్యులు రాగూర్, నిర్వాహకులు ఆల్‌హజ్‌బాషా, అక్బర్‌అలీ, షఫీ, అబీద్ పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాలు విడుదల

వింజమూరు / దుత్తలూరు (ఉదయగిరి రూరల్) జూలై 19: శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలోని గురుపౌర్ణమి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం వింజమూరు పిరమిడ్ మాస్టర్ హేమలత, రాజేశ్వరి, కౌసల్య ఆచారి నారాయణరెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీవేదవ్యాసుడు విగ్రహ ప్రతిష్ఠాపన, స్వామీజీల సందేశాలు, మధ్యాహ్నం ధ్యాన ప్రసాదం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శ్రీవేదవేస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ధ్యాన సాధన మహాశక్తి సజ్జన సాంగత్యం, ఆచార్య సంగీతం మధ్యాహ్నం ధ్యాన ప్రసాదం శాకాహార ర్యాలీ జరుగుతుందన్నారు. ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ప్రచారం చేసి అందర్నీ ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో వింజమూరు నాగులు, పార్వతి, కొందరు మాస్టర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ


నెమ్మళ్లదిన్నెలో కంది విత్తనాల పంపిణీ చేస్తున్న సర్పంచి రామచంద్ర

సీతారామపురం, జులై 19: నెమ్మళ్లదిన్నె రైతుసేవా కేంద్రంలో సబ్సిడీతో ఎల్ఆర్‌జి-52 కంది రకం విత్తనాలను శుక్రవారం సర్పంచ్ రామచంద్ర ఆధ్వర్యంలో అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఏఏ లక్ష్మీనారాయణ మాట్లాడారు. మొదటిరోజు క్వింటం కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఆగస్టు మొదటివారం వరకు కంది పంటకు అనుకూలంగా ఉంటుందని, ఐదు ఎకరాల లోపు రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి విత్తనాలను పొందవచ్చన్నారు. కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రొట్టెల పండుగ

ఉదయగిరి రూరల్, జూలై 19: స్థానిక పెద్ద చెరువులో శుక్రవారం రొట్టెల పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. జోరు వర్షంలో పట్టణంతో పాటు దాసరిపల్లి, మాసాయిపేటలోని హిందూ, ముస్లింలు పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. ప్రధానంగా వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది.

ఆర్డీవో ఏర్పాట్ల పరిశీలన



సంగం, జూలై 19: నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా బారా సాహెబ్ దర్గా దర్శనకు వచ్చే భక్తులు ఏఎస్‌పేట దర్గాకు వెళ్తూ స్నానాలు చేసి, విశ్రాంతి తీసుకునేందుకు సంగం బ్యారేజీ వద్దకు వస్తుంటారు. వీరికి రక్షణకు చేసిన ఏర్పాట్లు, సౌకర్యాలను శుక్రవారం ఆర్డీవో మధులత పరిశీలించారు. స్నానాలు, మరుగుదొడ్ల తాత్కాలిక ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

సోమశిల డ్యాం వద్ద నీటి కష్టాలు

అనంతసాగరం, జూలై 19: సోమశిల జలాశయం దిగువన పర్ణశాలల వద్ద ఉన్న కుళాయిలకు నీరు రాక పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలోని మురుగుదొడ్లకు నీరు సరఫరా లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. మహిళల అవస్థలు చేపలేనివిగా ఉన్నాయి. అధికారులు స్పందించి నీటి సరాఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట కాలువలో పూడికతీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాలువలో పూడికను తీయించి బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆత్మకూరు, జూలై 19: అప్రమత్తత లేకుంటే రోగాల పాలు అనే శీర్షిక రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రామస్వామిపల్లిలో శుక్రవారం కార్యదర్శి పి.భాస్కర్ పంట కాలువలోని పూడికను తీయించి శుభ్రం చేయించారు. అనంతరం పంటకాలువ పరిసర ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించి, కాలువలో ఆయిల్ బాల్స్ వేయించారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం

వరికుంటపాడు, జూలై 18: తోటలచెరువుపలి పీర్ల గ్రామోత్సవాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో వర్షం కురుస్తున్నా ముందుకు సాగారు. దారిపొడవునా వారు కడ వలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎడతెరపి లేని ముసురు

వరికుంటపాడు, జూలై 19: మండలంలో రెండురోజులుగా మోస్తారు వర్షం కురుస్తుంది. గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆపై రాత్రి తగ్గుముఖం పట్టినా శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా ముసురు కమ్ముకొని కురిసింది. గ్రామాల్లోని వీధులు చిత్తడిగా మారాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.


ఉదయగిరి రూరల్: ఉదయగిరిలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వర్షంతో పాటు చలితో కూడిన ఈదురుగాలులు వీయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మోస్తారు వర్షాలు కురవకపోవడం, నీటి వనరులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అనంతసాగరం: రెండురోజుల పాటు మోస్తారు వర్షం కురిసింది. సాగులో ఉన్న వరి, మిరప, పత్తి పంటలకు కాస్త ఊరట లభించిందని రైతులు తెలిపారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

ఉయగిరి రూరల్, జూలై 19: స్థానిక బీసీకాలనీ సమీపంలోని గణేష దత్తసాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామికి కాగడహారతి, పంచామృతాభిషేకం, నిత్యపూజలు, శాంతిహోమాలు, మధ్యాహ్న, సంధ్యాహారతితో పాటు ప్రత్యేక పుష్పాలంకరణలో సాయిబాబా పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్


కాలనీలో పనులు చేయిస్తున్న ఎంపీడీవో

సీతారామపురం. జూలై 19: స్థానిక కోటవీధి, కురవ వీధితో పాటు పలు కాలనీల్లో పారిశుద్ధ్యంపై శుక్రవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల వద్ద బీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా డయేరియా, మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నట్లు చెప్పారు. స్థానిక పంచాయతీ పరిధిలో ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా పనులు చేపట్టామన్నారు.

నేడు ఉదయగిరి మండల సమావేశం

ఉదయగిరి, జూలై 19: మండల సమావేశం శనివారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఈశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనంలో నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన సాలిపేట సర్పంచి చాపల రమణయ్య, కర్లపాలెం గ్రామస్థులు

గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం : ఎమ్మెల్యే ఇంటూరి

- నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన కర్లపాలెం వాసులు
- తెలుగుదేశం గూటికి సాలిపేట సర్పంచి రమణయ్య

కందుకూరు, జూలై 19: వైసీపీకి కంచుకోటగా ఉన్న గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ సర్పంచ్ చాపల రమణయ్య తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు పంచాయతీలోని కర్లపాలెం గ్రామానికి చెందిన 36 కుటుంబాల వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారంతా శుక్రవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి ఇకముందు టీడీపీలోనే తమ ప్రయాణం సాగిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇవ్వటంతో వారికి ఆయన టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చాపల రమణయ్యతో పాటు కర్లపాలెం గ్రామపెద్దలు మీరయ్య, లంకె సుబ్బారావు, చాపల శ్రీనివాసులు, తదితరులంతా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామమైన కర్లపాలెం గ్రామస్థులు పునరావాసం, భూ పరిహారం తదితర అంశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు వివరించగా సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలిపేట పంచాయతీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సర్పంచ్ చాపల రమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విధానాలు నచ్చి టీడీపీలో చేరుతున్నామని, ఆయన ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం ఏర్పడిందని పేర్కొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

లింగసముద్రం, జూలై 19 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదల దరి చేర్చడమే ధ్యేయమని కందు కూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపవని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఆధార్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రె పాటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో పలువురు ఎస్టీలు తమకు ఆధార్‌కార్డులు లేవని, దీనివలన తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో కందుకూరు సబ్ కలెక్టర్ జి విద్యాధరితో చర్చించి ఆధార్ నమోదు సెంటర్‌ను ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. జనన ధృవీకరణ పత్రం లేని వారి నుంచి అర్జీలు స్వీకరించి, వారికి త్వరలో ఆధార్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు పలువురికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ డా. కేపీ నరసింహారావు, మాజీ సర్పంచ్ సయ్యద్ నాయబ్ రసూల్, దేవస్థానం ఛైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎమ్మెల్యేకు సత్కారం

కందుకూరు: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న వెంగమాంబ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి ఎస్సీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతకుముందు చర్చి సెంటర్ నుంచి ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టరు బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నేతలతో పాటు ఎస్సీ సెల్ నాయకులు చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, పులి నాగరాజు, లింగాబత్తిన మాల్యాద్రి, రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన రాళ్లపాడు టీడీపీ నేతలు


నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన రాళ్లపాడు టీడీపీ నేతలు, తెలుగు రైతు అధ్యక్షుడు రామారావు తదితరులు

లింగసముద్రం, జూలై 19: మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని రాళ్లపాడు గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు పలువురు శుక్రవారం మండల తెలుగు రైతు అధ్యక్షుడు మద్దాల రామారావు ఆధ్వర్యంలో నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామంలోని బీసీ కాలనీకి వాటర్ ప్లాంటు మంజూరు చేయాలని ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు రామారావు చెప్పారు.

టీం సేవియర్స్ సేవలు ప్రేరణ దాయకం


టీంసేవియర్స్ బృందాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, జూలై 18: టీం సేవియర్స్ సేవలు ప్రేరణ దాయకమని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు ఎన్ ప్రణీత్‌కు ఇటీవల తమిళనాడులోని ఊటిలో జాతీయ అవార్డు బహూకరించింది. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రణీత్, సంఘం బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. తాను భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడేలా మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించతలపెట్టానని అందుకు టీంసేవియర్స్ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిద్దు, టీం సేవియర్స్ సభ్యులు మౌర్య, భార్గవ్, మణిదీప్, ఆకాంక్ష, కృష్ణవేణి, మేఘన, కరిష్మా, రాకేష్ పాల్గొన్నారు.

ఈ-స్టాంపును రద్దు చేయాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితసంఘాల నేతలు

కావలి, జూలై 19: ఈ-స్టాంపులను రద్దు చేసి భారత ప్రభుత్వం విడుదల చేసే పాత స్టాంపులను ప్రజలకు అందుబాటులోకి తేవాలని దళిత సంఘ రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ విషయంపై ధర్నా చేపట్టి ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ స్టాంపులను తీసుకవచ్చారని నాణ్యత లేని స్టాంపులపై జరిపిన లావాదేవీల పత్రాలు అనతి కాలంలోనే చిరిగిపోతున్నాయని వాపోయారు. ఆస్తుల పత్రాలు దీర్ఘకాలం దెబ్బతినకుండా ఉండేందుకు పాత స్టాంపులను టీడీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకరావాలని కోరారు. ఈ స్టాంపులతో ఎస్సీ, ఎస్టీలు తమ ఆస్తులను రిజిష్ట్రేషన్ చేయించుకుని ప్రయివేట్ బ్యాంకుల వద్ద అప్పులు తెచ్చుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కొత్త ప్రభుత్వం ఈస్టాంపులను రద్దుచేసి పాత స్టాంపులను ప్రవేశపెట్టాలన్నారు.

కందుకూరులో ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు

కందుకూరు: దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కందుకూరు కేవీకేలో శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రైతులు, రైతు మహిళలు, యువ రైతుల సమక్షంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 740 కేవీకేలు రైతులకు సేవలందిస్తున్నాయని తెలిపారు. కందుకూరులో కేవీకే ప్రారంభించి పదేళ్లు అవుతోందని, ప్రస్తుతం పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తల నియామకం జరగటంతో రైతులకు భవిష్యత్తులో మరింత సేవలందించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద అర్హత కలిగిన ఎస్సీ రైతులకు నీటి తడులు ఇవ్వటానికి అవసరమైన పీవీసీ పైపులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి, శ్రీరంగ, మాయాంక్, వివేక్, నిహారిక పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

కలిగిరి: పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు వేదపండితులు పున్నవజ్ఝల శేషసాయి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం పాలాభిషేకం, ప్రత్యే కపూజలు, మహిళల కోలాట ప్రదర్శన ఉంటాయన్నారు. ఆదివారం స్వామి సర్వదర్శనం, అన్నదాన కా ర్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం విశేష పుష్పా లంకరణతో గ్రామోత్సవం, చిన్నారుల కోలాటం ప్రదర్శన ఉంటాయన్నారు.

నీటి సంబంధిత వ్యాధులు రాకుండా చర్యలు

కావలి రూరల్, జూలై 19: నీటి సంబంధిత వ్యాధులు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు సూచించారు. శుక్రవారం ఆయన ఆముదాలదిన్నె సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించేలా గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతూరులో పారిశుధ్య పనుల పరిశీలన

కావలి, జూలై19: పట్టణంలోని పాతూరు 4వ వార్డులో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పనితీరును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. వర్షపు నీరు కాలనీల్లో నిల్వ ఉండకుండా డ్రైనేజీలను శుభ్రం చేయాలని వాటిని పరిశీలించారు. చెత్తా, చెదారం నిల్వలతో రోగాలు ప్రబలకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వార్డుల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే కావలి పురపాలక సంఘం కంట్రోల్ రూంకు 08626 243706, 9963029494 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

గురుపూర్ణిమ ఉత్సవాల ప్రారంభం

కావలిటౌన్, జూలై19: గురుపూర్ణిమ మహోత్సవాలు పట్టణంలో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసిన శ్రీసాయి క్షేత్రం, ఆర్టీసీ డిపో వెనుకనున్న నందదీప్ సాయిసమాజ్ మందిరం, పాతూరు శివాలయం పక్కనున్న సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ మహోత్సవాల పూజలు జరిగాయి. శ్రీసాయి క్షేత్రంలో ఉదయం కాగడ హారతి, ఓంకార ధ్వజారోహణ, బాబా వారికి ప్రత్యేక అభిషేకాలు, సహస్ర నామార్చన పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని బాబాను దర్శించుకున్నారు. శనివారం గోపూజ, తులసి పూజ, ధుని పూజ, సామూహిక లక్ష మల్లెలార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు.

ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

అల్లూరు, జూలై 19: ధరలను నియంత్రించడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్టు తహసీల్దారు దుర్గేశ్వరరావు తెలిపారు. అల్లూరు రాయాజీవీధిలో శుక్రవారం ఆయన రాయితీపై విక్రయించే సరుకుల షాపును ప్రారంభించి మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయాజీవీధిలోని వీవీఎస్ ప్రొవిజన్స్ దుకాణంలో స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వో రంతుల్లా, నాయకులు కృష్ణ చైతన్య, బుల్లా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అరగల రమణయ్య, కార్తీక్ శర్మ, మద్దిబోయిన శ్రీను, కట్టా నవీన్, వంగర రవి, ఖదీర్, నాయబ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, జూలై 19: మండలంలోని చీమల పెంట మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఎస్‌హెచ్ఓ పి మల్లికార్జున సిబ్బందితో దాడి చేసి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

బిట్రగుంట, జూలై 19: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మహిళ పోలీస్ పుష్పలత తెలిపారు. బోగోలు పంచాయతీ అరవపాలెంలో శుక్రవారం సార్ధ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రూత్ బెనీమి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు బోగిరి ప్రభాకర్, ఎల్ మాధవరావు హాజరైయ్యారు. చెడు వ్యసనాల జోలికి పోకుండా మంచి నడవడిక కలిగి జీవించాలన్నారు. సమాజ సేవ చేస్తున్న సార్ధ్ సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు హేమలత, గౌతమి, నాగిణి, రూపా, లక్ష్మీ, స్థానికులు ఉన్నారు.

బోగోలులో మోస్తరు వర్షం

బిట్రగుంట, జూలై 19: బోగోలు మండలంలో శుక్రవారం తెల్లవారు జామున ఓమోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు వర్షపు చినుకులు పడుతూ చలిగాలి వీచింది. సాయంత్రం వర్షపు జల్లులు క్రమంగా పెరిగి ఓ మోస్తరు వర్షం కురిసింది.

సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

కలిగిరి, జూలై 19: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం వెలగపాడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డు నిర్వహణపై సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందే సేవల్లో జాప్యం ఉండరాదన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కావలి టౌన్, జూలై 19: మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్షుడు తురకా శీనయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పట్టణ సంఘం సర్వసభ్య సమావేశం శీనయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన హెల్త్ అలెవెన్సులు, సమ్మెకాలపు జీతాలు, డైలీ కార్మికుల మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నేతలు బిరదల రమేష్, ఓ రమేష్, పరుసు రమేష్, జలదంకి బాబు, క్రాంతి పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

కావలి టౌన్, జూలై 19: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు సముదాయంలోని బార్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం ట్రంకురోడ్డులో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా లోక్ అదాలత్ ఛైర్మన్ శోభ పాల్గొని మాట్లాడారు. వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని.. హెల్మెట్ వాడకం వలన ప్రాణ రక్షణ కలుగుతుందన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురామ్, అడిషనల్ పీపీ రామకృష్ణ, ఏపీపీ మృదుల, బార్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, జయప్రకాష్, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో విద్యా వ్యవస్థకు మహర్దశ

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విడవలూరు: అన్నారెడ్డిపాళెంలో విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూలై 19: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. జడ్పీ బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యాకిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని బాలికలు తాము విద్యుత్ సరఫరాలేని సమయంలో ఇబ్బందులు పడు తున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె వెంటనే స్పందించి సొంత నిధులతో హాస్టల్‌లో ఇన్వర్టర్లు, పాఠశాలలో తాగునీటి ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు నైతిక విలువల్ని నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పేదరికాన్ని జయించేది విద్య మాత్రమేనన్న వాస్తవాన్ని విద్యార్థులు, తలిదండ్రులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, ఎంఈఓ రవి, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలో కొత్త వంగళ్ళు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విద్యాసామాగ్రిని శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, నాయకులు శ్రీహరి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: మండల పరిధిలోని అన్నారెడ్డిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం బ్యాగులను అందజేశారు. అనంతరం గ్రామ దేవత అంకమ్మ తల్లి ఉత్సవాల్లో ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సింహాద్రి అయ్యప్ప, పెదమాల శేఖర్, నాగేశ్వరరావు, బండ్ల గోవర్ధన్, మడపర్తి చరణ్, మడపర్తి మోహన్, సురేష్ చెముకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



గ్రామంలో ఊరేగుతున్న మహాలక్ష్మమ్మ అమ్మవారు

తోటపల్లిగూడూరు, జూలై 19: మండలంలోని గ్రామ దేవత మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హంస వాహనంపై అమ్మవారు గ్రామ వీధుల్లో ఊరేగారు. గ్రామంలో సందడి నెలకొంది. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శిం చుకున్నారు.

అంకమ్మ గ్రామోత్సవం



గ్రామంలో ఊరేగుతున్న అంకమ్మ

విడవలూరు, జూలై 19: స్థానిక గ్రామదేవత అంకమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి పూలంగి సేవ ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ పూజరులు అమ్మవారికి కుంకుమార్చలు, అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 19: బుచ్చి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం కమిషనర్ రమణబాబు ఈఎస్‌ఐ కార్డులను అందజేశారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు ఈఎస్‌ఐ కార్డుల ద్వారా పైసా ఖర్చులేకుండా ఆసుపత్రిలో వైద్యం పొందవచ్చని తెలిపారు.

డస్ట్‌బిన్ వితరణ



డస్ట్‌బిన్ అందజేస్తున్న బీపీసీఎల్ అధికారులు

విడవలూరు, జూలై 19: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు శుక్రవారం తహసీల్దారు శ్రీనివాసులుని కలసి డస్ట్‌బిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిటీ భానుప్రకాష్, బీపీసీఎల్ ప్రాజెక్టు అధికారులు ఎన్ ఉమారాణి, నరసింహరావులు, వీఆర్వో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

పాడె మోసి గురుభక్తిని చాటుకున్న కాకాణి



గురువు పాడె మోస్తున్న మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు, జూలై 19: తనకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువు పాడె మోసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి తన గురుభక్తిని చాటుకున్నారు. కాకాణికి చదువు చెప్పిన సిద్ధయ్య మాస్టారు బుధవారం మృతిచెందగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కాకాణి పాల్గొని పాడె మోశారు.

మెరుగైన జీవన ప్రమాణాల కల్పనే లక్ష్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అదానీ ఫౌండేషన్ హెడ్ డాక్టర్ అభిషేక్

ముత్తుకూరు, జూలై 19: మెరుగైన సామాజిక జీవన ప్రమాణాలను కల్పించడమే తమ లక్ష్యమని అదాని ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ అభి షేక్ లఖ్టాకియా తెలి పారు. శుక్రవారం ఆయన సదరన్ రీజియన్ సీఎస్సార్ హెడ్ డాక్టర్ అనీల్ బాలకృష్ణన్‌తో కలిసి ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో చేసిన పనులను పరిశీలించారు. కృష్ణపట్నం పంచాయతీలోని రామ్‌నగర్, ఆర్కాట్‌పాలెం, కృష్ణపట్నం గ్రామాలలో వాటర్ ప్లాంట్‌లను సందర్శించి, నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం అదాని ఫౌండేషన్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయడానికి మహిళా బృందం నిర్వహిస్తున్న సెంట్రల్ కిచెన్‌ను ప్రారంభించారు. అలాగే ముత్తుకూరులోని అదాని విద్యామందిర్, అదానీ జూనియర్ కళాశాలను పరిశీలించారు. పునరావాస కాలనీల కాపులతో ముచ్చటించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఆర్వో ప్లాంట్, అంగన్‌వాడీ సెంటర్, అదానీ చికిత్సాశాలను, అదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. అదాని వరల్డ్ స్కూల్ ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ సత్యనారాయణ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్, రాజేష్ రంజన్, వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

మినగల్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఉత్తమ అవార్డు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 19: మినగల్లు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ఉత్తమసేవా అవార్డు పొందినట్టు జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు. గతేడాది నవంబరులో ఢిల్లీ నుంచి సెంట్రల్ క్వాలిటీ సూపర్‌వైజరీ కమిటీ జిల్లావ్యాప్తంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించింది. దీంతో మినగల్లు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌కు అవార్డు వచ్చినట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పొదలకూరు, జూలై 19: తోడేరు పంచాయతీ పరిధిలోని కాకాణి రమణారెడ్డి గారె న్స్‌లోని ఆక్రమణలను మండల అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ లేఅవుట్‌లో ఆక్రమించిన స్థలంలో నిర్మించిన నాలుగు ముఖ ద్వారాలను రెవెన్యూ ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, నుడా, పంచాయతీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మండల తహసీల్దారు బి శివకృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ పొట్టేళ్ల వాగు ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ అన్వేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రియాజ్, ఇరిగేషన్ ఏఈ అనీల్‌కుమార్, మండల సర్వేయర్ లాలి వెంకటేశ్వర్లు, సచివాలయం అధికారి ఎం వెంకటేష్, వీఆర్‌వోలు శ్రీహరి, పేరయ్య, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో సభ్యత్వం లేకపోతే కార్మికులం కాదా..?

● అదానీ కృష్ణపట్నం పోర్టు వోల్వో డ్రైవర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న వోల్వో డ్రైవర్లు

ముత్తుకూరు, జూలై 19: సీఐటీయూలో సభ్యత్వం లేకపోతే కార్మికులుగా పరిగణించని ఆ పార్టీ నాయకుల పద్ధతి సరికాదని అదానీ కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముత్తుకూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంఘం లో సభ్యత్వం లేకపోతే కార్మికులను ఆకతాయిలు, రౌడీలు అని పేర్కొనడం మండల సీఐటీయూ నాయకులకు తగదన్నారు. ప్రస్తుతం తాము సంఘం నుంచి దూరంగా ఉన్నామన్న కారణంతో వేధించాలని చూడడం హేయమన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టులో ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వాగ్వివాదాన్ని దాడిగా చిత్రీకరించడం, తమ స్వలాభం కోసం దానిని పెద్దది చేసేందుకు ప్రయత్నించడం మానుకోవాలన్నారు. దాడికి గురయ్యామని చెబుతున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు, ఆరోగ్య ఇబ్బందులు లేవన్న మెడికల్ రికార్డులను విలేకరులకు చూపించారు. ఈ కార్యక్రమంలో వోల్వో డ్రైవర్ల నాయకులు ఏడుకొండలు, సురేష్‌రెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యం డీటీకి అప్పగింత

మనుబోలు, జూలై 19: అక్కంపేట వద్ద మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంతో రేషన్‌బియ్యం అక్రమ రవాణా వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ట్రక్కుఆటోలో 70బస్తాల రేషన్ బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచారు. ట్రక్కుఆటో డ్రైవర్ పరారవడంతో పూర్తివివరాలు ఇంకా తెలియలేదు. వర్షాలు పడుతుండడంతో బియ్యం పాడైపోతున్నాయని పోలీసులు శుక్రవారం ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దారు శివప్రసాద్‌కు అప్పగించారు. దీంతో బియ్యం బస్తాలను స్థానిక సొసైటీలో భద్రపరిచామని డీటి తెలిపారు.

శుభ్రతకు నోచని మంచినీటి ట్యాంక్‌లు

కలుషిత నీటితో ప్రజల అవస్థలు

కొడవలూరు, జూలై 19: అధికారుల నిర్లక్ష్యానికి తోడు శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంక్‌లు శుభ్రతకు నోచుకోక కలుషిత నీరు తాగి వ్యాధులకు గురికావల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాల కింద కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తోంది. ఈ నీటి నిల్వ చేసే ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకుకోసారి శుభ్రం చేయాలి. తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాల్సి ఉంది. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కే మెట్లు పాడై ఉండడంతో ట్యాంక్ శుభ్రం చేయలేక పోతున్నారు. దీంతో ట్యాంక్ లోపల నాచు ఏర్పడి తాగునీరు రంగు మారి సరఫరా అవుతున్నాయి. నార్నురాజూపాళెం, కొడవలూరు, మానేగుంటపాడు, గండవరం, కొత్తవంగళ్ళులో కుళాయి నీరు తాగడానికి గ్రామస్థులు భయపడుతున్నారు. భూమిలో ఎన్నో సంవత్సరాల నాటి మట్టి పైపులు పగిలి మురికి నీరు వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. చాలామంది ఈ నీటిని వాడుకకు ఉపయోగిస్తూ, తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌లకు పరుగులు పెడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని క్యాన్ 15 నుండి 20 రూపాయల వరకు అమ్ముతున్నారు. అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు నిర్వహించి ట్యాంక్‌లను శుభ్రంచేసి రక్షిత నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న మంచి ట్యాంక్



కుళాయిలో వచ్చిన మురుగు నీరు

పెట్రోలు బంకుల్లో నిబంధనలు తూచ్!

● దయనీయంగా నిర్వహణ

● గాలి మిషన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కరువు



నెల్లూరు(హరనాథపురం); జూలై 19: జిల్లాలోని పెట్రోలు బంకుల నిర్వహణ దయనీయంగా ఉంది. నాలుగైదు బంకుల్లో తప్ప మిగిలినచోట్ల వాహనాల టైర్లకు గాలికొట్టే మిషన్లు లేవు. మరుగుదొడ్లు కూడా ఎక్కడా కానరావటం లేదు. పెట్రోలు, డీజిల్ కొలతలు సరిగ్గా ఉన్నాయా ? అంటే అదీ అనుమానమే. ఎంతోమంది వాహనదారులు పెట్రోలు, డీజిల్ కొలతపై ఫిర్యాదు చేస్తున్నారు. పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించుకోడానికి ఫిల్టర్ పేపర్లు ఇవ్వాలి. ఎక్కడా అవి కనపడడం లేదు. నిబంధనలను పెట్రోలు బంకుల యజమానులు ఏమాత్రం ఖాతరు చేయటం లేదు. జిల్లాలో వాహనాల సంఖ్య బాగా పెరిగింది. ద్విచక్రవాహనాలతో పాటు కార్లు లారీలు, బస్సులు, ఇతర వాహనాల సంఖ్య ఎక్కువగానే ఉంది. దీంతో జిల్లాలో పెట్రోలు, డీజిల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. బంకులూ పెరిగాయి. పెట్రోలు, డీజిల్ వ్యాపారం పెరటంతో ఆయా కంపెనీలు డీలర్లకు ఆకర్షణీయమైన కమీషన్ ఇస్తూ బంకుల సంఖ్యను పెంచుతున్నాయి. అయితే బంకుల్లో నాణ్యత, సౌకర్యాలు ప్రశ్నార్థకంగా మారాయి. నాణ్యతా, సౌకర్యాలు తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాలశాఖ, తూనికల కొలతలు, రెవెన్యూ విజిలెన్స్ తదితర శాఖలు బంకుల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ తనిఖీలకు వెళ్లినా తనిఖీలకు వెళ్లే బంకులకు సమాచారాన్ని ముందే చేరవేస్తున్నారనేది సమాచారం. దీంతో బంకుల వారు తాత్కాలికంగా అప్రమత్తమైనా, అధికారులు వచ్చి వెళ్లిన తరువాత మళ్లీ మామూలే.

● **189 పెట్రోలు, డీజిల్ బంకులు :**

జిల్లాలో 189 పెట్రోలు, డీజిల్ బంకులు ఉన్నాయి. రోజూ 7 లక్షల లీటర్ల డీజిల్, 4 లక్షల లీటర్ల పెట్రోలు వినియోగం జరుగుతోంది. ఈ బంకుల్లో కొన్ని బంకుల్లో మాత్రమే, టైరు గాలి మిషన్‌లు కానవస్తున్నాయి. అయితే ఇవి పేరుకే ఉన్నాయి. టైరుకు గాలికొట్టమని అడిగితే ఆపరేటర్ లేడని, బయటకు వెళ్లాడని సమాధానం వస్తోంది. గాలి మాత్రం కొట్టడం లేదు.

నిబంధనలు ఇలా..

- పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి.
- ప్రతి బంకులో సంస్థ వివరాలతో పాటు యజమాని పేరు కన్పించేలా బోర్డు ఏర్పాటు చేసి మొబైల్ నంబరు బోర్డుపై రాయాలి.
- ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్ ఉండాలి. వాహన దారులు అందులో నమోదు చేసుకొనే అవకాశం కల్పించాలి.
- ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. తాగేందుకు నీరు అందించాలి.
- తప్పనిసరిగా వాహనాల టైర్లకు గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిత్యం అవి పనిచేసేలా చూడాలి.
- పెట్రోలు బంకుల్లో 10వేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600 వెచ్చించాలి. నెలకు రూ.18 వేలు మరుగుదొడ్లకు, తాగునీరు, ఇతర సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాలి.
- దూరప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు కాలకృత్యాలు తీర్చుకోడానికి మరుగుదొడ్లు ఉండాలి. ఒక వేళ ఉన్నా, తాళాలు వేసి ఉంటున్నాయి.

● **ఇలా ఫిర్యాదు చేయాలి**

పెట్రోలు, డీజిల్ బంకుల్లో సౌకర్యాలు లేకపోతే సెంట్రలైజ్డ్‌గ్రీవెన్స్ అండ్ మోనటరింగ్ సిస్టమ్ పోర్టల్ అయిన పీజీ పోర్టల్.జీవోవి. ఇన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా పౌరసరఫరాలు, తూనికలు కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి

తనిఖీలు నిర్వహిస్తున్నాం



పెట్రోలు బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం. ఏదైనా అనుమానాలు ఉంటే ప్రతి పెట్రోలు బంకులో తూనికల కొలతలశాఖచే సరిచూచి ముద్రవేయబడిన ఐదు లీటర్ల పరిమాణం కల కొలత పాత్ర ఉంచాలి. దీని ద్వారా పరిమాణాన్ని సరిచూచుకోవచ్చు. అదిలేక పోతే ఫిర్యాదు చేయవచ్చు.

- కే ఐజక్, తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ డైరెక్టర్

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 : నగరంలోని వివిధ సాయి మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బాలాజీనగర్ సాయిదర్బార్‌లో ఉదయం 9గంటలకు వేడుకలు జరుగుతాయని మందిర నిర్వాహకులు మధుసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, సాయినామ సంకీర్తనలు, అన్నసంతర్పణలు జరుగుతాయన్నారు. సాయంత్రం హారతులు, విష్ణు సహస్ర నామ పారాయణం, పండరి భజనలు, కోలాటాలు, పల్లకి ఉత్సవం, ఊంజల్‌సేవలు జరుగుతాయని పేర్కొన్నారు. 22వతేదీ సాయిచరిత్ర పారాయణం, 28తేదీ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

● **22 నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు**

గాంధీబొమ్మ సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో ఆదివారం నుంచి 30 వతేదీ వరకు గురుపౌర్ణమి వేడుకలు జరుగుతాయని మందిరం ఛైర్మన్ మన్నెం అమరనాథ్ రెడ్డి తెలిపారు. ప్రతీరోజు ఈ ఉత్సవాల్లో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విష్ణు సహస్ర నామ పూజలు జరుగుతాయని తెలిపారు. 30వ తేదీ నగరోత్సవం జరుగుతుందన్నారు. అలాగే మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో ఆదివారం ఉదయం 10గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీవారి కళ్యాణం, రాత్రికి గరుడసేవ జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది.

భక్తిశ్రద్ధలతో జైనుల ర్యాలీ



నగరంలో జైనులు నిర్వహించిన ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19: నగరంలోని మహావీర్ జైన్ ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే చాతుర్మాస దీక్షలకు తరలివస్తున్న జైన్ గురువులకు శుక్రవారం జైన్ కుటుంబాలు ఘన స్వాగతం పలికాయి. జైన్ పీతాంబర్ మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో ఆచార్య ఉదయ ప్రభా సూరీశ్వర్ శిష్య బృందంలోని ముని ధన్యప్రభ, మునిగోయం ప్రభలు చాతుర్మాస దీక్షలు చేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆచారివీధిలోని రాజేంద్ర టవర్ నుంచి మండపాల వీధి మహావీర్ జైన్ మందిరం వరకు ఈ ప్రదర్శన సాగింది. జరిగింది. జైన్ మహిళలు కలశాలను నెత్తిమీద పెట్టుకుని భక్తిగీతాలతో ముందుకు సాగారు. జైన్ డోల్ బృందం వాయిద్య విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురుముని ధన్యప్రభ భక్తులకు చాతుర్మాస ఉపవాస దీక్షల గురించి వివరించారు.

లైంగిక వేధింపులపై చట్టాలు కఠినం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 19: లైంగిక వేధింపులపై చట్టాలు కఠినంగా వ్యవహరిస్తాయని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ అన్నారు. శుక్రవారం నారాయణ డెంటల్ హాస్పిటల్‌లో షీ కమిటీ అధ్వర్యంలో లైంగిక వేధింపుల రక్షణ చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు, మహిళా సిబ్బందికి లైంగిక వేధింపుల చట్టం, చర్యలు, లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి... అనే అంశాలపై వివరించారు. లైంగిక వేధింపుల నిరోధానికి సంస్థలు మరింతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సమత, నారాయణ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రే జీనాల్డ్, డీన్ డాక్టర్ శివకుమార్, షీ కమిటీ చైర్మన్ డాక్టర్ వందన రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

కాంతార విలన్ కాకాణి



మాట్లాడుతున్న గునుకుల కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 19: పాపాలతో కళ్లు మూసుకుపోయిన కాంతార విలన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేరును ఉచ్చరించే అర్హత ఆయనకు లేదని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. జనసేన జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు కల్తీ మద్యం అమ్మిన విషయంలోనూ, కోర్టులో ఫైల్ మిస్సింగ్ విషయంలోనూ, అక్రమ మైనింగ్‌లోనూ ఆయన తీరును ప్రజలు గమనించే సరైన బుద్ధి చెప్పారన్న విషయాన్ని కాకాణి మరిచిపోయినట్లు ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిది నెలల కిందట తప్పిపోయిన మహిళ కేసును తొమ్మిది రోజుల్లో ఛేదించేలా చేసిన ఘనత పవన్‌కళ్యాణ్‌దే నన్నారు మరోసారి పవన్ గురించి మాట్లాడితే జనసైనికులు చేసే తిరుగుబాటుకు నియోజకవర్గం వదిలి పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, వేటూరు రవికుమార్, కాకు మరళి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి సేవలో ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకాంబరీ అలంకారం జరిగింది. అమ్మవారి దర్శనం కోసం ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆలయానికి వచ్చారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ బి.వెంకట సుబ్బయ్య, ప్రధాన అర్చకులు రఘునాథస్వామి, ఉభయకర్తలు కొలపర్తి వెంకటరమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి ఘనస్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి పూజలు చేశారు.

● **వరదయ్యకు పరామర్శ**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : బీజేపీ సీనియర్ నాయకులు చిలుకోటి వరదయ్యను నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా 1991 సారా వ్యతిరేక ఉద్యమంలో మహిళలకు మద్దతుగా జక్కా వెంకన్న, దశరథరామన్న, తదితరులతో కలిసి పోరాడిన రోజులను సోమిరెడ్డి గుర్తుచేసుకున్నారు. వరదయ్యను కలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

కందుకూరులో ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు

కందుకూరు, జూలై 19: దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటై 50ఏళ్ల పూర్తయిన సందర్భంగా కందుకూరు కేవీకేలో శుక్రవారం స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రైతులు, రైతు మహిళలు, యువ రైతుల సమక్షంలో స్వర్ణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 740 కేవీకేలు రైతలుకు సేవలందిస్తున్నాయని తెలిపారు. కందుకూరులో కేవీకే ప్రారంభించి పదేళ్ల అవుతోందని, ప్రస్తుతం పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తల నియామకం జరగటంతో రైతులకు భవిష్యత్తులో మరింత సేవలందించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద అర్హత కలిగిన ఎస్సీ రైతులకు నీటి తడులు ఇవ్వటానికి అవసరమైన పీవీసీ పైపులను ఉచితంగా అందచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), జూలై 19: నగరంలోని సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీ నగర్, రాం నగర్, ఓల్డ్ మిలిటరీ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఇస్కాన్ సిటీ, పరిధిలో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఆకాశవాణిలో వెంకయ్య పరిచయం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19: నెల్లూరు ఆకాశవాణి కేంద్రంలో శనివారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు తెలుగు పద్యాలు ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తో పరిచయ కార్యక్రమం ప్రసారమవుతుందని ఆకాశవాణి ప్రోగ్రాం డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిచయ కార్యక్రమాన్ని విశ్రాంత ఏడీజీ రేవూరు అనంతపద్మనాభరావు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పెన్షనర్ల భవన్‌లో గుండె వైద్యశిబిరం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 : నగరంలోని భక్తవత్సలనగర్‌లోగల పెన్షన్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం గుండె వైద్యశిబిరం జరిగింది. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.జయరామ్, పీపీసీ వైద్యులు డాక్టర్ ఎం వీ.రమణయ్య తదితరులు పరీక్షలు నిర్వహించారు. సింహపురి దేహసమర్పణ సంస్థ కన్వీనర్ విజయ, బ్రహ్మం భార్గవి, అసోసియేషన్ నేతలు ఎస్ఎం.గౌస్, ఎస్‌పీవీఎస్.మూర్తి పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

పవన్‌కల్యాణ్ తరపున రొట్టె వదిలాం..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 19: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సీఎం కావాలని గత ఏడాది రొట్టె పట్టామని, ఆ కోరిక తీరడంతో తిరిగి రొట్టెను వదిలామని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు. స్వర్ణాల చెరువులో శుక్రవారం పార్టీ నాయకులు రొట్టెను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రొట్టెల పండుగకు ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించా రు. ప్రభుత్వం మారడంతో అధికారులు అద్భుతంగా ఏర్పాట్లు చేశారన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సుందర రామిరెడ్డి, చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, షేక్ అలియా, నూరి, పాల్గొన్నారు.



తెలుగు కవిత్వంలో నిలువెత్తు సంతకం

అడిగోపుల వెంకటరత్నంకు నివాళి

తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ద కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్ను మూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్లీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగది, ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు, మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వగీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.



అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవార్డు, తానా అవార్డు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు, తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం, నూతలపాటి కవితా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్దమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.

"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది.. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాపకం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉంటుంది... నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెలీగలం.. ఎదుగూ బొదుగూ లేని వాళ్లం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్ దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూపొందించిన చిత్రాలనే ముఖ చిత్రాలుగా ముద్రించుకున్నారు. అడిగోపుల కవిత్వంపై శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎన్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.

టైగర్ రొయ్యకు వైట్‌స్పాట్

- వైరస్ సోకి లక్షల్లో చనిపోతున్న పిల్లలు
- లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

నిన్న మొన్నటి వరకు వెనామీ రొయ్యల సాగులో లక్షల నుంచి కోట్ల రూపాయలతో నష్టపోయిన ఆక్వా రైతులకు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. వెనామీతో వచ్చిన నష్టాలను టైగర్ రొయ్యల సాగుతోనైనా పూడ్చుకుందామనుకున్న వారికి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టయ్యింది. వాతావరణంలో మార్పులు కారణంగా గుంటల్లోని రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్ వైరస్ సోకుతోంది. వేల నుంచి లక్షల్లో పిల్లలు చనిపోతూ ఒడ్డుకు కొట్టుకొస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

- కోట

సముద్ర తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరుల్లో రెండేళ్ల నుంచి ఆక్వా రైతులు వెనామీ సాగుకు స్వస్తి పలికారు. టైగర్ రొయ్యల సాగును చేపట్టి ఉన్నారు. మొదట్లో టైగర్ రొయ్యలకు ఎలాంటి సమస్యలు రాకుండా లాభాలను తెచ్చిపెట్టింది. దాంతో చాలామంది రైతులు టైగర్‌సాగును చేపట్టారు. పుదుచ్చేరి, చెన్నై, కేరళవంటి ప్రాంతాల నుంచి రొయ్యల పీడ్‌ను తీసుకోకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టైగర్ రొయ్య పిల్లలను గుంటల్లో వదిలిన 30 రోజుల తర్వాత అవి వైట్‌స్పాట్ వైరస్ బారినపడి చనిపోతున్నాయి. ప్రధానంగా కోట మండలం సిద్ధవరం, కర్లపూడి, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, దొరువుకట్ట గ్రామాల్లో ఎక్కువగా వైరస్ సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వాతావరణంలో మార్పులూ కారణమే..

వారం రోజులుగా వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం, చల్లటి వాతావరణం ఉండటం కూడా వైట్‌స్పాట్ వైరస్ రావడానికి కారణమంటున్నారు రైతులు. దీనివల్ల గుంటల్లో నీటి ఉష్ణోగ్రత 16 డిగ్రీల కంటే తగ్గడం ప్రధాన కారణంగా టెక్నీషియన్లు చెబుతున్నారు.



చనిపోయిన రొయ్యలు

లక్షణాలిలా..

వైట్ స్పాట్ వైరస్ సోకిన రొయ్యపిల్లల మొప్పల్లో తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. తర్వాత రొయ్యపిల్లలు క్రమేపీ మేత (ఫీడ్) తినడం మానేస్తాయి. రోజురోజుకూ బలహీనపడి చనిపోతాయి.

చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్ మానుకో..!

- పెద్దిరెడ్డితో మాకు ఎలాంటి సంబంధాలు లేవు
- అవసరమైతే కాణిపాకంలో ప్రమాణం చేస్తా
- నా కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు
- చెవిరెడ్డిని రాజకీయ సమాధి చేస్తా
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగ్రహం



తన కాలు వాపు ఇంకా తగ్గలేదని మీడియాకు చూపుతున్న పులివర్తి నాని

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో మాకు ఎలాంటి లావాదేవీలు లేవు. యాధృచ్ఛికంగా రెండే సార్లు ఎయిర్‌పోర్టులో కలసినపుడు పలకరించడం తప్ప. నేను కానీ నా కుటుంబసభ్యులు కానీ ఆయనకు ఫోన్ చేసినా, కలిసి మాట్లాడినట్టు నిరూపించినా కాణిపాకంలో ప్రమాణం చేస్తా. చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్ మానుకో' అంటూ చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. పులివర్తినానీపై చెవిరెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాని ఘాటుగా ప్రతిస్పందించారు. 'పెద్దిరెడ్డితో తన భార్య కుటుంబానికి బంధుత్వం ఉన్నమాట వాస్తవమేనంటూ.. ఎర్రావారిపాళెం కరుణాకర్‌రెడ్డి ఇరు కుటుంబాలకు బంధువైనా తమకు వ్యతిరేకంగా పనిచేశారని తెలిపారు. 'మా కార్యకర్తలపై మీరు దాడులు చేశారు. రాజకీయంగా ఎదిగే నాలాంటి వ్యక్తిపై నిందలు వేయద్దు. నిన్ను రాజకీయ సమాధి చేసేవరకు నేను బతికే ఉంటా.' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. 'నేను గెలిచిన తర్వాత శ్రీవారికి మొక్కుబడి తీర్చుకోలేని పరిస్థితి నీవల్లే వచ్చింది. నా ఆరోగ్యం సహకరించక నడిచి వెళ్లలేక పోయా. నటించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ నాకాలు వాపు తగ్గలేదు. నా కార్యకర్తలను వాడు, వీడు అని మాట్లాడితే నేను సహనం కోల్పోవాల్సి వస్తుంది. నా కార్యకర్తలు దేవుళ్లతో సమానం. మీ కార్యకర్తలను కూడా నేను గౌరవిస్తా. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా మాట్లాడవద్దు' అన్నారు. డైవర్షన్ రాజకీయాలు చేసినా దొంగ ఓట్లు అంశం, తమపై దాడి ఘటనలపై విచారణ జరిపించి తీరుతామని స్పష్టం చేశారు. తన క్వారీలకు రూ.49.5లక్షలు డిమాండు నోటీసు ఇచ్చారని, ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారని, హైకోర్టుకెళ్లి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నానని నాని వివరించారు. 'పెద్దిరెడ్డి కాదు కదా ఏ రెడ్డి కాళ్లూ నేను పట్టుకోను. కేవీఎస్ పేరుతో బోగస్ ట్రస్టు పెట్టి తప్పుడు లెక్కలు రాసి దోచేస్తున్నావు. కొవిడ్ సమయంలో పంపకాల ముసుగులో మఠం భూములు నొక్కేశావు' అని ఆరోపించారు. 'సీఆర్ రాజన్.. పెద్దిరెడ్డి మనిషని చెబుతున్నావు. మీతో నచ్చకనే ఆయన మా పార్టీలో చేరారు' అన్నారు.

భక్తజనసంద్రం



తపస్మాన్ చుట్టూ కిక్కిరిసిన భక్తులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు వైభవంగా జరిగింది. అర్జునుడి వేషధారి తపస్మాన్ పైనుంచి విసిరే నిమ్మకాయల కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

- శ్రీకాళహస్తి

పులివర్తి నానీకి మా పెద్దిరెడ్డే గాడ్‌ఫాదర్

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయనకు వెన్నెముకలా నిలిచారు

టీడీపీ ఎమ్మెల్యే నానీపై చెవిరెడ్డి సంచలన ఆరోపణలు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి వైసీపీ పాలనలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నెముకలా అండగా నిలిచారని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పులివర్తి నానీకి మా పార్టీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డే గాడ్ ఫాదర్' అని వ్యాఖ్యానించారు. అందుకే తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల నాని క్వారీలు ఒక్క గంటైనా మూయలేదని చెప్పారు. ఆయన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని ఆపలేదు. నిబంధనలు పాటించకపోయినా స్టోన్ పాలిషింగ్ పరిశ్రమ జోలికెళ్లలేదని వివరించారు. నిబంధనలు పాటించకపోయినా సంబంధిత శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి చర్యలు తీసుకుకోకపోగా, పాతమైనింగ్ కొనసాగిస్తూ అదనంగా మూడు హెక్టార్లు ఇచ్చారని చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. 'మా పార్టీ నేత ఎమ్మార్సీ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తే మావాళ్లెవరూ ఖండించలేదు కానీ, నాని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఖండించారు' అని గుర్తుచేశారు. వైసీపీతో ఆయనకు లోపాయికారీ ఒప్పందం ఏస్థాయిలో ఉందో వెల్లడవుతోందని అన్నారు. అదేవిధంగా పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సీఆర్ రాజన్, ఎన్నికల ముందు టీడీపీలో చేరి, నెల రోజులకే చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడి పదవిని పొందారు. మా పెద్దిరెడ్డి సన్నిహితుడికి పార్టీ పగ్గాలు అప్పగించి వైసీపీ నేతపై ఉన్న కృతజ్ఞతను నాని చాటుకున్నారని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో నాని అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎంతమందిపై దాడిచేస్తారో చేయండి. వడ్డీతోపాటు చెల్లిస్తా..' అని చెవిరెడ్డి హెచ్చరించారు.

సొంత రెవెన్యూ డివిజన్‌లో నో పోస్టింగ్

- తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- జిల్లాకు రానున్న 42మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై19: ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని 42మంది తహసీల్దార్లను జోన్ 1, 2, 3, 4కు బదిలీ చేశారు. తాజాగా వీరంతా సొంత జిల్లాకు రావడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) ఆదేశిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. సీసీఎల్‌ఏ నుంచి కలెక్టర్లకు ఉత్తర్వులు అందగానే అయా జిల్లాల్లోని తహసీల్దార్లను సొంత జిల్లాకు పంపించనున్నారు.అయితే వీరికి సొంత రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ కేటాయించరాదని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. కాగా, వైసీపీతో అంటకాగిన పలువురు తహసీల్దార్లు తిరిగి ప్రధాన మండలాలకు రావడానికి అప్పుడే ఎన్డీఏ కూటమి నేతల వద్ద పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

బాలిక హత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

దొరవారిసత్రం, జూలై 19: దొరవారిసత్రం మండలంలో జరిగిన బాలిక హత్యాచారం కేసులో నిందితుడు దిలీప్‌కుమార్ సదాను శుక్రవారం పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. బిహార్ రాష్ట్రంలోని బెహరి ప్రాంతానికి చెందిన దిలీప్‌కుమార్ సదా (20) రైసు మిల్లులో పనిచేసేందుకు వచ్చి ఈ దారుణానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. నిందితుడిని సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరచడంతో మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు.

సౌకర్యాలెలా ఉన్నాయ్?

- శ్రీవారి భక్తులతో ముచ్చటించిన హోంమంత్రి అనిత



భక్తులను పలకరిస్తున్న అనిత

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాలెలా ఉన్నాయంటూ తిరుమలలో శ్రీవారి భక్తులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. కాలినడకన శుక్రవారం తిరుమలకు చేరుకున్న ఆమె క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా అక్కడున్న భక్తులను పలకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ కొంతసేపు వారితో మాట్లాడారు.

జగన్.. నీకు దమ్ముంటే నీ చెల్లెళ్లకు న్యాయం చేయగలవా?

తిరుపతి(నేరవిభాగం), జూలై 19: 'జగన్.. నీకు దమ్ముంటే రాష్ట్ర ప్రజలకు కాదు.. నీ చెల్లెళ్లు షర్మిల, సునీతకు న్యాయం చేయగలవా?' అని హోంమంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. అంతేకానీ ప్రభుత్వంపై రోజూ బురదజల్లడం మంచిది కాదన్నారు. హోంమంత్రి కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం నిమిత్తం శుక్రవారం తిరుపతికి విచ్చేశారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గంజాయి మత్తులో మైనర్లపై కొందరు కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఐదేళ్లలో గంజాయిని రాష్ట్ర పంటగా వైసీపీ ప్రభుత్వం పంట పండించి కోట్ల రూపాయలు దోచుకుందని విమర్శించారు. లిక్కర్‌పై దృష్టి సారించి కోట్లు దోచుకోవడం తెలిసిన జగన్‌కు, ఆయన కోటరీకి గంజాయి నిర్మూలనపై ఎందుకు దృష్టి సారించలేక పోయారని ప్రశ్నించారు. చిన్న పిల్లలు సంచుల్లో గంజాయిని తీసుకెళ్లే సంస్కృతి తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో వందలాది మంది బాలికలు కనిపించకుండా పోయారని వాపోయారు. పుంగనూరులో విధ్వంసాలు సృష్టించిన చరిత్ర వైసీపీ నాయకులకే దక్కుతుందన్నారు. పల్నాడులో జరిగిన ఘటన చాలా బాధాకరమని, దీనికి ప్రభుత్వం చింతిస్తోందని చెప్పారు. ప్రస్తుతం శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ పాకులాడుతోందని, వారి కుయుక్తులు, ఎత్తుగడలు తమ ప్రభుత్వంలో చెల్లవన్నారు. అనంతరం అలిపిరి వద్ద పూజలు నిర్వహించాక కాలినడకన తిరుమలకు వెళ్లారు.

ఉన్మాది కోసం ముమ్మరంగా గాలింపు

- ఐదు బృందాల ఏర్పాటు


తిరుపతి(నేరవిభాగం), జూలై 19: తిరుపతి రాయల్ నగర్‌లో గురువారం వృద్ధురాలు జయలక్ష్మి గొంతు కోసి దారుణంగా హత్య చేసి పరారైన ఉన్మాది శ్రీనివాసులు కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆమె ఇద్దరు మనవరాళ్లపైనా నిందితుడు దాడి చేసిన సంగతి తెలిసిందే. నిందితుడి ఆచూకీ కోసం వివిధ ప్రాంతాల్లోని అతడి స్నేహితుల ఫోన్ నెంబర్లు, కాల్ డేటా లాంటి వివరాలు సేకరిస్తున్నారు. అదనపు ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో నగర డీఎస్పీ రవిమనోహరాచారి, క్రైం డీఎస్పీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, 25 మంది కానిస్టేబుళ్లు ఐదు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. నిందితుడు హైదరాబాదులో తలదాచుకున్నట్లు సెల్ టవర్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులు స్నేహితుల కదలికలపై నిఘా ఉంచారు. జయలక్ష్మి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియతికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మరో యువతి ప్రేరణకు వైద్య సేవలు అందించి డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.

వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జేవీ రమణ



తిరుపతి రూరల్, జూలై 19: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఈమేరకు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈయన ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారన్నారు. 1991లో అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలిలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన రమణ.. 2001లో వెటర్నరీ వర్సిటీలో యానిమల్ న్యూట్రిషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2007లో ప్రొఫెసర్‌గా, 2016 నుంచి ఐదేళ్లపాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేశారు. 2022 అక్టోబరు నుంచి రెండో దఫా డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా నియమితులై కొనసాగుతున్నారు. వీసీగా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

లేబర్ డీసీ బాలు నాయక్‌కు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి



తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.బాలు నాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పదోన్నతి లభించగా వారిలో బాలు నాయక్ కూడా ఉన్నారు. పదోన్నతిపై ఆయన్ను ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా కర్నూలుకు బదిలీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్, జూలై 19: స్థానిక ఐసీఎస్ రోడ్డు, నారాయణ కళాశాల సమీపంలోని సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి, జూలై 19: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో జరుగుతుందని ఎంపీడీవో అరుణ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కురుగొండ్ల హాజరవుతారని, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు

నాయుడుపేట టౌన్, జూలై 19 : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న అఖిలాండేశ్వరిదేవి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష కాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామివార్లకు పాలాభిషేకం, నందీశ్వరుడికి ప్రదోష కాల పూజలు నిర్వహించారు.

న్యాయవాదుల నిరసన



నాయుడుపేట టౌన్, జూలై 19: నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం కోర్టు వద్ద ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పార్థసారధిరెడ్డి, కిరణ్, రమణయ్య, రఫీ, సుమన్ తదితరులు ఉన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

గూడూరు, జూలై 19: స్థానిక రెండో పట్టణ పరిధిలో ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన వినయ్‌కుమార్ ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థిని కళాశాల నుంచి వస్తుండగా అడ్డగించి, బెదిరించి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన విషయం విదితమేనన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాన్నారు. శుక్రవారం తాళమ్మగుడి సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. వినయ్‌కుమార్‌పై 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. సీఐ పాపారావు, రెండో పట్టణ ఎస్ఐ సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి కేసులో....

పట్టణంలోని సాధుపేట సెంటర్‌లో గురువారం హెడ్‌కానిస్టేబుల్ స్వామిదాసుపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... పశ్చిమబెంగాల్‌లోని మాతా ప్రాంతానికి చెందిన లాల్‌తూ కలండి మరో ముగ్గురితో కలిసి మంగళవారం కోల్‌కాతా నుంచి చెన్నైకు పనుల నిమిత్తం వెళ్లేందుకు రైలులో బయలుదేరారన్నారు. ఇతను గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగేశాడని గురువారం ఉదయం నుంచి సాధుపేట సెంటర్‌లో తిరుగుతూ కానిస్టేబుల్‌పై దాడి చేశాడన్నారు. సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు పాల్పడే వారిని శిక్షించండి



టవర్‌క్లాక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, జూలై 19: మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టవర్‌క్లాక్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యశ్వంత్, ప్రణయ్, విక్రమ్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్యుల తనిఖీ



దొరవారిసత్రం, జూలై 19: పట్టణం లోని కేజీబీవీ కళాశాలలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులు చైతన్య, చంద్రకళ తనిఖీ చేశారు. సిబ్బందితో కలసి పాఠశాల ఆవరణం, వంటశాల, పిల్లల మరుగుదొడ్లలను పరిశీలించారు. ఇటీవల నాయుడుపేట గురుకుల పాఠశాలలో అతిసార ఘటనతో తనిఖీలు జరిపినట్లు డాక్టర్లు తెలిపారు. పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీహెచ్‌వో సంపూర్ణమ్మ, హెచ్ఎస్‌వో మైథిలి తదితరులు పాల్గొన్నారు.

టెంకాయతోపులో పారిశుధ్య పనులు

పెళ్లకూరు, జూలై 19: మండలంలోని టెంకాయతోపులో శుక్రవారం టీడీపీ నేతల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. 71వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా టెంకాయతోపు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించారు. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గంలేక పోవడంతో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో నీటిని తొలగించారు. అలాగే వీధుల్లో నిలబడిన మురుగు, బురదను తొలగించారు. టీడీపీ నేతలు డి.ప్రసాద్‌నాయుడు, ఎన్.సిద్దులయ్యనాయుడు, మోహన్‌నాయుడు, వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధు మోహన్‌దాస్ తదితరులు ఉన్నారు.

రెచ్చగొట్టే ధోరణి తగదు

వైసీపీ నేతలకు టీడీపీ నాయకుల హితవు

పెళ్లకూరు, జూలై 19: బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉన్న మిథున్ పుంగనూరుకు వెళ్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని తెలిసి కూడా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వెళ్లడం రెచ్చగొట్టే పని అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో శాంతిభద్రతలు ఎల్లప్పుడు కట్టుదిటంగా ఉంటాయని తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, పేరం మధునాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

గురుకులంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

నాయుడుపేట, జూలై 19: పట్టణంలోని ఎల్ఎసాగరంలోని బాలుర గురుకులంలో ఈనెల 14న ఆదివారం 128 మంది విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై 15వ తేది ఆస్పత్రిపాలైన విషయం విదితమే. గురుకుల పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రతగా ఉండటంతో 15వ తేదీనుంచి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కూడా దాదాపు 30 మంది పారిశుధ్య కార్మికులు ముమ్మరంగా పనులు చేపట్టారు.

ట్రై సైకిళ్ల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 19: స్థానిక పూలతోట గిరిజన కాలనీలో శుక్రవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో వి.అంకేశ్వరరావు జ్ఞాపకార్థం ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. వి.ప్రవీణ్, పావని, గిరిజమ్మ, ప్రసూనమ్మ, సుకన్య, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానం

- సీఎం చంద్రబాబు అనుభవంతో పాలన సాగిస్తున్నారు
- డక్కిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల



పేదలకు నాణ్యమైన సరుకులు అందచేస్తున్న కురుగొండ్ల

డక్కిలి, జూలై 19: జగన్ రెడ్డి గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో పరిపాలిస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీ అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదన్నారు. అయితే సీఎం చంద్రబాబు అనుభవంతో వనరులను సమకూర్చుకుని చెప్పినవన్నీ ఒక్కొక్కటిగా చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు, పింఛనుదారులకు టంచనుగా జీతాలు అందించడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.5 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాక పనులు ప్రారంభిస్తామన్నారు. గృహ లబ్ధిదారులకు గతంలో ఇంటి నిర్మాణానానికి రూ.1.80 లక్షలు ఇచ్చేవారని ప్రస్తుతం ధరల మేరకు రూ.3.50 లక్షల వరకు పెంచే అవకాశం ఉందన్నారు. ఉపాధి పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఏపీవో లక్ష్మీనారాయణకు సూచించారు. మండలంలోని చెరువుల స్థితిగతులు గురించి ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అలపరేరు డ్యాం మరమ్మతులకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపామని అధికాలు చెప్పారు. డక్కిలి మండలంలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా మేత పోరం బోకు భూముల్లో రైతులు సాగు చేసుకుంటున్నారని వాటికి పట్టాలు అందేలా చూస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు భూమికి పట్టాలు ఇవ్వలేదన్నారు. అనంతరం ఆయన దేవునివెల్లంపల్లి సెంటరులో ఏర్పాటుచేసిన నిత్యావసర సరుకుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖరరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్యనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, నాయకులు కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, పులి జనార్దనరెడ్డి, రంగినేని రాజా, ఎం. శివకుమార్‌రెడ్డి, చైతన్య రెడ్డి, డి.పెంచలరెడ్డి, డి.చంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లీలా మాధురి, ఎస్ఐ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు: కలెక్టర్



తమ్మినపట్నం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు/ కోట, జూలై 19: చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం, కోట మండలంలోని కొత్తపట్నంలో రైతులు సాగు చేసుకునే భూములకు పరిహార విషయమై న్యాయం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ) సంబంధించి భూసేకరణ విషయమై ప్రభుత్వ భూమి, డీకేటీ పట్టాలు, ఏలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూమి అనుభవంలో ఉన్న రైతులతో ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినపట్నంలో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో గతంలో ఏపీఐఐసీకి భూములు కేటాయించారన్నారు. అయితే ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. పట్టా భూమి, డీకేటీ పట్టా భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో ఏపీఐఐసీ అని నమోదైన వాటికి రైతుల వద్ద ఉన్న ఆధారాల రికార్డుల మేరకు అర్హత ఉన్న వారికి పరిహారానికి సిఫార్సు చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూమిలో రైతులు అనుభవం ఉన్న వారు ఎన్ని సంవత్సరాలుగా ఎంత విస్తీర్ణంలో ఎంత పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించాలని ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సాగులో ఉన్న వేరశనగ పంటను పరిశీలించారు. ఇక కొత్తపట్నం పంచాయతీలో 900 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ అన్నారు. అందులో మొదటి విడతగా గతంలో 425 ఎకరాలను తీసుకున్నారన్నారు. అయితే ఆ భూములను ఏపీఐఐసీ అప్పగించే సమయంలో ఆ భూములపై సాగుదారులు లేరన్నారు. ప్రస్తుతం కారిడార్‌కు వెళ్లిన భూముల్లో జీడీమామిడి, వేరుశెనగ పంటలు వేసుకొని 150 మంది రైతులు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆ రైతులకు కూడా గ్రామసభల ద్వారా గుర్తించి నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, తహసీల్దార్లు శ్రీనివాసులు, నాగరాజారావు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

గూడూరు, జూలై 19: రైతులు, కౌలు రైతులకు ఉపాధి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని, చెన్నూరులోని పలు సచివాలయాల్లో సచివాలయం సిబ్బందికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. గతేడాది కరువు సమయంలో, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారాన్ని రైతుల ఖాతాలలో జమచేయాలన్నారు. శివకుమార్, శంకరయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గూడూరు, జూలై 19: పట్టణంలోని అడివయ్యకాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. చిన్న కుమ్మరవీధిలో తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ఇంద్రవర్ధన్, చంద్రనీల్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, లక్ష్మణ్, కోటి, అవినాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, జూలై 19: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల నంతరం వేదపండితులు ఆశీర్వచనం, అమ్మవారి తీర్థప్రసాదాలు అంద జేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీకిషోర్, నాయకులు పెరుమాల్, ఎం. వెంకటేశ్వర్లు రెడ్డి, డి.రవి, బి.ఆంజనేయులు, చెంగయ్య, మేడా సాయి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వాకాడు, జూలై 19 : మండలంలోని దుగరాజపట్నం, చీమలపాడు తదితర గ్రామాల్లో బాల్య వివాహాలపై మహిళలకు శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులను దరి చేరకుండా చూడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నకుమారి, శాంతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు

నాయుడుపేట టౌన్, జూలై 19: నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎస్-8 బోగిలో పొగలు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో నాయుడుపేట స్టేషన్‌లో ఆగిన ఎక్స్‌ప్రెస్‌లోని బోగీలో అకస్మాత్తుగా పొగలు రావడంతో ప్రయాణికులు దిగేశారు. బ్రేకుల వద్ద రాపిడికి పొగలు వచ్చినట్లు గుర్తించిన రైల్వే సిబ్బంది మరమ్మతులు చేశారు. 20 నిమిషాల తరువాత రైలు బయలుదేరి వెళ్లింది.

డయేరియాపై అవగాహన ర్యాలీ

కోట, జూలై 19: మండల పరిధిలోని కేశవరం, సిద్దమ్మకండ్రిగల్లో శుక్రవారం డయేరియాపై అంగన్‌వాడీ చిన్నారులు, తల్లులతో అవగాహన ర్యాలీ జరిగింది. ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కాచి చల్లార్చిన నీరును తాగాలని కోరారు.

పుట్టాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

కోట, జూలై 19: మండల పరిధిలోని చెందోడులో శుక్రవారం గ్రామదేవత పుట్టాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. మొదటిరోజు అమ్మవారి పుట్టింటి నుంచి సారేను గ్రామస్తులు మేళతాళాలతో గుడి వద్దకు తీసుకువెళ్లి అమ్మవారికి అలంకరించారు.

స్కూల్ బస్సుల తనిఖీ



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ

గూడూరు, జూలై 19: నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల వాహనాలపై చర్యలు చేపడుతామని ఎంవీఐ జకీర్ హెచ్చరించారు. శుక్రవారం సాధుపేట సెంటర్‌లో పలు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ వాహనాల్లో సీట్ల మేరకే విద్యార్థులను ఎక్కించాలన్నారు. అధికంగా ఎక్కించినా, విద్యార్థులు నిల్చొని ప్రయాణించినా చర్యలు తీసుకుంటామన్నారు.

బండల ధ్వంసంపై చర్యలు

నాయుడుపేట, జూలై 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ వాణిజ్య దుకాణాల ముందు మున్సిపాలిటీ స్థలం ఉంది. శుక్రవారం ఆ స్థలంలో ట్రాక్టర్లతో మట్టి తోలడంతో మున్సిపాలిటీ ప్రధాన కాలువ బండలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి... టౌన్ ప్లానింగ్ అధికారులను సంఘటనా స్థలికి పంపారు. తక్షణమే మట్టి తొలగించాలని, విరిగిన బండల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ హుమయున్ సదరు కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

కిశోర బాలికలకు అవగాహన

ఓజిలి, జూలై 19: ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు శుక్రవారం నాయుడుపేట ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు, పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలపై సూపర్‌వైజర్లు సుజన, ఆషాబేగం అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం మంజుల, టీచర్లు గీతా, మురుగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగుంటలో రైతు బజారు ఏర్పాటు

చిట్టమూరు, జులై 19: మండల కేంద్రంలోని కొత్తగుంటలో శుక్రవారం రైతు బజారును తహసీల్దార్ శ్రీనివాసశర్మ ప్రారంభించారు. నాణ్యమైన సరుకులు విక్రయించేందుకు ప్రభుత్వం రైతు బజారు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిలకర బియ్యం కిలో రూ.48లకే అందిస్తారని తెలిపారు. కంది పప్పు విక్రయించేందుకు దుకాణదారులు ముందుకు రాలేదన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

చిల్లకూరు, జూలై 19: స్థానిక దో షహీద్ దర్గాలో శుక్రవారం రొట్టెల పండుగ ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని బారా షహీద్ దర్గాలో రొట్టెల పండుగ ప్రారంభమైన మూడో రోజు చిల్లకూరులో రొట్టెల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ముజావర్ జుబేర్‌బాసా తెలిపారు. దర్గాలోని సయ్యద్ మహ్మద్‌సా, సయ్యద్ అహ్మద్‌సా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తానంకి నానాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

కోట/ గూడూరు, జూలై 19: కోట మండల పరిధిలోని గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలంటూ శుక్రవారం హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు రోడ్డును దాటుతుంటారన్నారు. గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను కలిసి పలు సమస్యలను పరిస్కరించాలని అర్జీలను అందజేశారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న అవినీతి

- జగన్ చేసిన అప్పుల వివరాలను చంద్రబాబు బహిర్గతం చేయాలి
- చింతా మోహన్



మాట్లాడుతున్న చింతా మోహన్

విజయవాడ(ధర్నాచౌక్), జూలై 19: ఎన్డీఏ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌లకు మంత్రులు రూ.5కోట్లకు బేరం పెట్టారని ఆరోపించారు. ఒక్కో ఐఏఎస్ అధికారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇస్తున్నారన్నారు. నరేంద్రమోదీ, బీజేపీ అవినీతికి ఇది నిదర్శనమని చెప్పారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ధరలను స్థిరీకరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం నుంచి అధికంగా వలసలు పెరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2019లో 2 లక్షల 65వేల కోట్ల అప్పు ఉండగా జగన్ హయాంలో రూ.14 లక్షల కోట్లకు చేరాయన్నారు. నెలకు రూ.9వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తుందని చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని లక్షల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ చేసిన అప్పులపై వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి ఏవిధంగా కాపాడతారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర సంపదను కొల్లగొట్టారు: ఎమ్మెల్యే సునీల్



ఈశ్వరవాక సభలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

చిట్టమూరు. జులై 19: గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఈశ్వరవాక, అరవపాళెంలలో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రజా ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ఈశ్వరవాకలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గనులు, సిలికా, ఇసుక, గ్రావెల్, వైట్ క్వార్ట్జ్ వంటి విలువైన ఖనిజ సంపదను అడ్డంగా దోచుకున్నారన్నారు. జగన్ అలీబాబా అయితే... పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల, వై.వీ సుబ్బారెడ్డి, కొంత మంది ఐఏఎస్‌లు నలభై దొంగల్లా అవతారమెత్తారని ఆరోపించారు. అప్పు ఎక్కడ నుంచి తెచ్చారో కూడా అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. కొందరు సచివాలయం సిబ్బంది ఇంకా వైసీపీ మాయలో ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి.కిషోర్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, జి.కస్తూరయ్య, ఎం. జనార్దన రెడ్డి, ఎన్.రాజేష్‌రెడ్డి, డి.శరత్‌చంద్రారెడ్డి, డి.భారతమ్మ తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, జూలై 19: సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా శాఖల వారీగా అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు మానండి

ఆత్మ గౌరవం, క్రమశిక్షణపై నిర్మించిన టీడీపీ క్రమశిక్షణారాహిత్యం క్షమార్హం కాదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. ఓజిలిలో శుక్రవారం ఎమ్మెల్యే విజయశ్రీ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. రెండు వర్గాలుగా రెండు ప్రాంతాల్లో నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకడాన్ని ఆయన తప్పుబట్టారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు ఓటుతో అంతం పలికారు... ఇలాంటి పరిస్థితిలో పార్టీ యంత్రాంగం మరింత ఐకమత్యం చాటుకోవాలని నెలవల సూచించారు. టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసురెడ్డి, తెలుగు మహిళ నేత పవిత్రారెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

వాకాడు, జూలై 19: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తూపిలిపాళెం, బాలిరెడ్డిపాళెం, వాకాడుల్లో ఆయన పర్యటించారు. తూపిలిపాళెం సముద్రతీరం విశాలంగా, సహజ సిద్ధంగా ఉందన్నారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ ఇప్పటికే పర్యాటక కేంద్రంగా తూపిలిపాళెం తీరాన్ని గుర్తించి నివేదిక అందించారన్నారు. అనంతరం బాలిరెడ్డిపాళెం వద్ద గత సంవత్సరం డిసెంబరులో స్వర్ణముఖినది వరద ప్రవాహానికి పొర్లుకట్టలు దెబ్బతిని పొలాల్లో ఇసుకమేటలు వేయడం, బాలిరెడ్డిపాళెం నుంచి గంగన్నపాళెం గ్రామానికి నిర్మించిన వంతెన దెబ్బతినడంపై నాయకులు డి.మధుసూదన్‌రెడ్డి, పి.పురుషోత్తంరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి రూ.1.70 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం వాకాడు స్వర్ణముఖి బ్యారేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకుడు రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జయచంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దారు నరసింహరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఈ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఆగిన రైల్వే అండర్‌బ్రిడ్జి పనుల పరిశీలన



ఆగిన పనులను పరిశీలిస్తున్న రెవెన్యూ, రైల్వే అధికారులు

తడ, జూలై 19: మండలంలోని పెరియవట్టు వద్ద అర్ధంతరంగా ఆగిన రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణంతో పంచాయతీ కార్యాలయం కూలే ప్రమాద ముందని తక్షణం చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమార్ రైల్వే అధికారులను కోరారు. శుక్రవారం చెన్నై రైల్వే డీఆర్ఎం విశ్వనాథ్‌మీర్యతో కలసి అండర్‌బ్రిడ్జిని పరిశీలించారు. ఏడాది క్రితం గుంతలు తవ్వి వదిలేశారు. అప్పటి నుంచి ఆ గుంటలో నీళ్లు నిలబడి మట్టి జారుతోందన్నారు. కొద్ది రోజుల క్రితం పంచాయతీ కార్యాలయ సమీపం వరకు మట్టి జారిపోవడంతో మండల అధికారులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు శుక్రవారం ఆ అండర్‌బ్రిడ్జిని పరిశీలించి కాంట్రాక్టర్‌తో చర్చించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచ్ గోవిందుశెట్టి, డిప్యూటీ తహసీల్దారు శరత్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు స్థల పరిశీలన



తడ, జూలై 19: మండలంలోని తడకండ్రిగ పంచాయతీలో మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాన్ని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ పరిశీలించారు. సైన్స్ ఆఫ్ ఇండియా పత్రికా సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సుమారు 10వేల మొక్కలను నాటేందుకు భూములు చూపాల్సిందిగా కలెక్టర్‌ను గత కొద్ది రోజులక్రితం కోరారు. కలెక్టర్ ఆదేశాలతో సర్వే నెం.213లో సుమారు 60 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు అనువుగా ఉందని నిర్ణయించారు. ఆర్ఐ శ్రావణ్‌కుమార్, వన్యప్రాణి విభాగం అధికారులు, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.